

మనం

జనం కోసం అక్షర యజ్ఞం...



AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

అమరావతి | సంపుటి: 3 • సంచిక: 30 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | సోమవారం • 7-1-2019 | www.manamnews.com | /manamnews



90,000 కోట్లు ఆదా

- ఆధార్‌తో అర్హులకే సబ్సిడీ పథకాలు
- దేశంలో ఆధార్ ఓ గేమ్ చేంజర్
- మోదీ నేతృత్వంలో విజయవంతం
- దేశానికి ఏటా 77 వేల కోట్లు ఆదా
- 122 కోట్ల ఆధార్ నెంబర్లు జారీ
- కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడి

7

కాంగ్రెస్‌కు అంత సీన్‌లేదు

- బీజేపీని ఓడించడానికి మేం చాలు
- కాంగ్రెస్ లాంటి పార్టీలు అక్కర్లేదు
- అమేథీ, రాయ్‌బరేలి వదిలేస్తాం..
- యూపీలో వాళ్ల అప్రాధాన్య శక్తి
- కాంగ్రెస్ గురించి ఆలోచించడంలేదు
- బీఎస్పీతో కలిసి మేం పోరాడుతాం
- సమాజ్‌వాదీ పార్టీ నాయకుడి వ్యాఖ్య

7



మావల్లే రాజ్యాంగ సవరణలు

2

- ప్రజాప్రతినిధులు లేకపోయినా విజయం
- ఎన్నికలంటేనే ఇప్పుడు ధనస్వామ్యం
- లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ

పందెంకోళ్లు...



గోదారి పల్లెల్లో మొదలైన సంక్రాంతి సందడి

- పందేలకు సిద్ధమైన కోడిపుంజులు
- బాదంపప్పు.. జీడిపప్పులతో విందు
- ప్రతి రోజూ వ్యాయామం.. ఈత
- కోడి కత్తులకు పెరుగుతున్న పదును
- వేటు వేస్తే.. పుంజుతల ఎగిరిపడాల
- కోసు పందేలకు సన్నద్ధమైన బరులు
- ఇతర దేశాల నుంచి కూడా అతిథులు
- కోట్లాది రూపాయలలో జరిగే పందేలు
- కోర్టు వద్దన్నా.. పోలీసులున్నా అంతే
- జాతకాలు చూసి మరీ బరిలోకి పుంజు



ఒంగోలు, జనవరి 6 (మనం న్యూస్‌బ్యూరో):

పుష్యమాసం దగ్గర పడింది.. పల్లెల్లో సంక్రాంతి సందడి అప్పుడే మొదలైపోయింది. దీనికితోడు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల కోడిపందాల జోరు ఊపందుకుంది. ఇన్నాళ్లు జీడిపప్పు.. బాదం, పిస్తా లాంటివి పెట్టి పందెం కోడిపుంజులను కంటికి రెప్పలా పెంచిన యజమానులు.. వాటితో బరిలోకి దిగుతున్నారు. ఇవేమీ సాదాసీదా కోళ్లు కావు. వెరీ వెరీ స్పెషల్. బరిలోకి దిగుతూనే కయ్యానికి కాలు దువ్వుతూ పౌరుషంతో రెచ్చిపోతాయి. ఇక వాటి యజమానులతో పాటు పై పందేలు కాసేవాళ్లు కూడా కొట్టు, కుమ్ము.. ఇరగదియ్.. దూకు... వేసేయ్ అంటూ బరిలోని కోళ్లను ఉత్సాహపరుస్తారు. అరుపులు, కేకలతో ఆ ఏరియా అంతా దద్దరిల్లిపోతుంది. పోలీసు ..మిగతా 2లో



రైల్వేస్టేషన్లలోనూ పక్కాగా తనిఖీ

ప్రయాణికులు ముందుగా రావాల్సిందే

- బయల్దేరే 15-20 నిమిషాల ముందు.. లగేజి స్కానింగ్ సహా ముమ్మర తనిఖీలు
- విమానాశ్రయాల తరహాలో భద్రతా చర్యలు
- స్టేషన్ మొత్తాన్ని సీల్ చేసేలా ప్రణాళికలు
- అడుగడుగునా స్టేషన్‌లో సీసీటీవీ కెమెరాలు
- రైలు ఎక్కేవరకు పలు అంచెలుగా చెకింగ్
- ఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అరుణ్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 6:

రైల్వే స్టేషన్లను కూడా ఇక మీదట విమానాశ్రయాల తరహాలో నిర్వహించాలని రైల్వేశాఖ యోచిస్తోంది. ప్రయాణికులు రైలు బయల్దేరడానికి కనీసం 15-20 నిమిషాల ముందుగానే స్టేషన్లకు చేరుకుని, భద్రతాపరమైన తనిఖీలు చేయించుకోవాలన్న నిబంధన పెట్టాలని భావిస్తోంది. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన భద్రతా చర్యలు చేపట్టే ప్రక్రియ ఇప్పటికే ప్రయాగ్‌రాజ్ స్టేషన్‌లో మొదలైంది. ఈ నెలలో ప్రారం భమయ్యే కుంభమేళా కోసం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపడుతూ అందులో భాగంగా రైల్వేస్టేషన్లలోనూ భద్రత పెంచారు. అలాగే కర్ణాటకలోని హుబ్లీ రైల్వేస్టేషన్‌లోనూ ఈ భద్రత కొనసాగుతోంది. త్వరలో మరో 202 స్టేషన్లలో కూడా దీన్ని అమలుచేస్తామని రైల్వే భద్రతాదళం డైరెక్టర్ ..మిగతా 2లో

ఇదీలోకం!



నీ పవరేంటో మొన్న తెలంగాణ ఫలితాల్లో చూశాగా.. నన్ను వదిలేయ్ రాములమ్మ.!

చెట్లకు విషప్రయోగం!

వృక్షాలను చంపేసేందుకు ప్రయత్నం

- అడుగుభాగంలో డ్రిల్లింగ్.. ఇంజెక్షన్
- విషాన్ని పంపుతున్నార్నన్న స్థానికులు
- బృహన్ముంబై కార్పొరేషన్‌కు ఫిర్యాదు
- పోలీసులకు ఫిర్యాదుచేసిన కార్పొరేటర్
- బిల్డర్ ప్రయత్నమేనంటూ అనుమానం



ముంబై, జనవరి 6:

ఎక్కడైనా మనుషులకు స్లోపాయిజన్ ఇచ్చి క్రమంగా చంపేయడం మనకు తెలుసు. కానీ, ముంబై మహానగరంలోని ..మిగతా 2లో



మార్పునకు సమయం

ఆ సమయం ఆసన్నమైంది

- రాజకీయాల్లో కృతజ్ఞత లేదు.. నేనెవరో అశోక్‌కు తెలియదట
- ఆయన కోసం ప్రచారం చేశా.. కులాల కుమ్ములాటలు వద్దు
- విజయనగరం నుంచి వలసలా.. నా బలం కోస్తా జిల్లాల్లోనేనట
- అనంత కవాతు విజయం ఎలా?.. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్

విజయవాడ, జనవరి 6:

రాష్ట్రంలో మార్పు వచ్చే సమయం ఆసన్నమైందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. తాను కేవలం అధికారం పొందడానికే పార్టీ పెట్టలేదని.. దీర్ఘకాల మార్పు లక్ష్యంగా రాజకీయాల్లోకి ..మిగతా 2లో

వాతావరణం



ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం వాతావరణం పొడిగా.. కాస్త వెచ్చగా ఉండే అవకాశం ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు కొంత తగ్గొచ్చు.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు
గాలిలో తేమ: 61 శాతం
గాలి వేగం: గంటకు 13 కి.మీ.

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: శుక్లపక్షం,పాడ్యమి ఉ.7.41 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.7.26 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.11.54 నుంచి 1.39 వరకు, దుర్ముహూర్తం: ప.12.27 నుంచి 1.11 వరకు, తదుపరి ప.2.41 నుంచి 3.23 వరకు, రాహుకాలం: ఉ.7.30 నుంచి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుంచి 12.00 వరకు, అమృతఘడియలు: ప.12.24 నుంచి 1.56 వరకు

రుజువు చేస్తారా.. రాజీనామానా?

హెచ్‌ఏఎల్‌కు ఆర్డర్లు ఎప్పుడిచ్చారు

- అలా ఇచ్చినట్లు రుజువు చేయండి
- రక్షణ మంత్రికి రాహుల్ సవాలు
- లక్ష కోట్ల ఆర్డర్లు ఇచ్చామన్న నిర్మల
- ఒక్క ఆర్డరూ రాలేదన్న సుర్జేవాలా
- జీతాలకు అప్పు చేసిందని వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 6:

హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు లక్ష కోట్ల రూపాయల విలువ చేసే ఆర్డర్లు ఇచ్చామన్న రక్షణ మంత్రి ..మిగతా 2లో

ఘోర ప్రమాదం

10 మంది తెలుగు అయ్యప్ప భక్తుల దుర్మరణం

- వ్యాన్‌ను ఢీకొన్న కంటెయినర్
- తమిళనాడులో రోడ్డుప్రమాదం
- స్వస్థలాలకు వస్తుండగా ఘోరం
- మృతులంతా మెదక్‌జిల్లా వాసులే
- ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి



చెన్నై, జనవరి 6:

తమిళనాడులో ఘోర ప్రమాదం సంభవించింది. అయ్యప్ప దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న భక్తులతో కూడిన వ్యాన్‌ను రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చిన కంటెయినర్ ఢీకొనడంతో.. వ్యాన్ ..మిగతా 2లో

రైల్వేస్టేషన్లలోనూ పక్కాగా తనిఖీ

(మొదటి పేజీ తరువాయి)

జనరల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ముందుగా రైల్వేస్టేషన్లను సీల్ చేయాలని అనుకుంటు న్నామని, ఎక్కడెక్కడ బయటకు వెళ్లడానికి మార్గాలున్నాయో గుర్తించి.. వాటిలో ఎన్నింటిని మూసేయడానికి కుదురుతుందో చూస్తున్నామన్నారు. శాశ్వత ప్రహరీలతో కొన్నింటిని మూస్తే మరికొన్నిచోట్ల ఆర్పీఎఫ్ సిబ్బంది పహరా కాస్తారని, మరికొన్నిచోట్ల గేట్లు పెడతామని ఆయన వివరించారు. ప్రతి ఎంట్రీ పాయింటు వద్ద భద్రతాపరమైన తనిఖీలు ఉంటాయని.. అయితే విమానాశ్రయాల తరహాలో ప్రయాణికులు గంటల ముందే రావాల్సిన అవసరం ఉండదని.. కేవలం 15-20 నిమిషాల ముందు వస్తే సరిపోతుందని అరుణ్ చెప్పారు. దానివల్ల భద్రతాపరమైన తనిఖీల కారణంగా తమకు ఆలస్యమైందని ప్రయాణికులు చెప్పాల్సిన అవసరం ఉండదన్నారు. భద్రత పెరుగుతుంది గానీ, భద్రతా సిబ్బంది మాత్రం అంతగా పెరగబోరని అరుణ్‌కుమార్ వివరించారు. తాము టెక్నాలజీలో పెట్టుబడులు పెంచేకొద్దీ మనుషుల అవసరం క్రమంగా తగ్గుతుందన్నారు. దేశవ్యాప్తంగా 202 రైల్వే స్టేషన్లలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 2016లో ఆమోదించిన సమీకృత భద్రతా వ్యవస్థ (ఐఎస్ఎస్)లో భాగంగానే ఈ భద్రతా చర్యలు తీసుకుం టున్నామన్నారు. ఐఎస్ఎస్‌లో భాగంగా సీసీటీవీ కెమెరాలు, యాక్సెస్ కంట్రోల్, సిబ్బంది, లగేజి స్కానింగ్ వ్యవస్థ, బాంబుల గుర్తింపు, నిర్వీర్య వ్యవస్థ అన్నీ ఉంటాయని చెప్పారు. ప్రయాణికులు స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించినప్పటినుంచి రైలు ఎక్కేవరకు ప్రతి చోటా తనిఖీలు ఉంటాయని తెలిపారు. ఐఎస్ఎస్ ప్రాజెక్టుకు సుమారు రూ. 385.06 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. భద్రతా ప్రణాళికలో భాగంగా పలు అంచెల తనిఖీలు ఉంటాయని, అందులో ప్రయాణికులను స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించడానికి ముందు కూడా తనిఖీ చేయడం ద్వారా.. పీక్ అవర్స్‌లో స్టేషన్ల వద్ద రద్దీని తగ్గిస్తామని చెప్పారు. రియల్‌టైమ్ ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను కూడా అందుబాటు లోకి తేవడం ద్వారా పాత నేరస్థులను గుర్తించడం ఆర్పీఎఫ్ కమాండ్ సెంటర్‌కు సులభం అవుతుందన్నారు. ప్రయాణికులను ఉరామరికగా తనిఖీ చేస్తామని, అంటే ప్రతి 8వ లేదా 9వ ప్రయాణికుడిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని, అలాగే ఎవరిమీదైనా అనుమానం వచ్చినా వాళ్లను కూడా తనిఖీ చేస్తామని ఆయన వివరించారు.

రుజువు చేస్తారా.. రాజీనామానా?

(మొదటి పేజీ తరువాయి)

నిర్మలా సీతారామన్ ఆ విషయాన్ని రుజువు చేస్తారా.. లేదా తన పదవికి రాజీనామా చేస్తారా అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సవాలు చేశారు. ఆర్డర్లు ఇచ్చినట్లు ఆమె అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. హెచ్ఏఎల్‌కు ఒక్క ఆర్డర్ కూడా రాలేదని, అందుకే తమ ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి ఆ సంస్థ అప్పులు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా అన్నారు. ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చామంటున్న పత్రాలను నిర్మలా సీతారామన్ పార్లమెంటు ముందుంచాలి.. లేదా రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఆర్థికపరంగా కష్టాలు ఎదుర్కొంటున్న హెచ్ఏఎల్.. తమ ఉద్యోగులకు జీతాలు చెల్లించడం కోసం అప్పులు చేయాల్సి వస్తోందని మీడియాలో కథనాలు రావడంతో ఆయనీ సవాలు చేశారు. ఆర్డర్లు ఇచ్చే ప్రక్రియ మొదలైనా.. ఇంకా ఆర్డర్లు మాత్రం వాళ్లకు చేరుకోలేదని జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. అయితే ఈ వ్యవహారంపై హెచ్ఏఎల్ మాత్రం ఏమీ స్పందించలేదు. ''ఒక అబద్ధం చెబితే దాన్ని కప్పి పుచ్చుకోడానికి వంద అబద్ధాలు చెప్పాల్సి ఉంటుంది. ప్రధానమంత్రి చెప్పిన రఫేల్ అబద్ధాన్ని నిజమని చెప్పడానికి రక్షణ మంత్రి పార్లమెంటుకు అబద్ధాలు చెప్పారు. రేపు ఆమె లక్షకోట్ల ప్రభుత్వ ఆర్డర్లు హెచ్ఏఎల్‌కు ఇచ్చిన పత్రాలు పార్లమెంటుకు చూపించాలి.. లేదా రాజీనామా చేయాలి'' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్ సంస్థకు లబ్ధి చేకూర్చడానికే హెచ్ఏఎల్‌ను ప్రభుత్వం పక్కన పెట్టిందని కాంగ్రెస్‌పార్టీ ఆరోపించింది. దీన్ని తిప్పి కొట్టిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో కాంగ్రెస్ తీరును దునుమాడారు. కాంగ్రెస్ పార్టీ హెచ్ఏఎల్ కోసం మొసలి కన్నీరు కారుస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్ఏఎల్‌కు 53 మాఫీలు ఇస్తే, తాము రూ. లక్ష కోట్ల విలువైన కాంట్రాక్టులు ఇచ్చామని ఆమె అన్నారు. ఇదే విషయమై సుర్జేవాలా కూడా ట్వీట్ చేశారు. రక్షణ మంత్రి లక్ష కోట్ల ఆర్డర్లు ఇచ్చామంటున్నారని, హెచ్ఏఎల్ మాత్రం తమకు పైసా కూడా రాలేదని చెబుతోందని, తొలిసారి వాళ్లు తమ ఉద్యోగులకు జీతాలివ్వడానికి వెయ్యికోట్ల అప్పులు చేయాల్సి వచ్చిందని ఆయన తన ట్వీట్‌లో తెలిపారు.

ఘోర ప్రమాదం

డ్రైవర్ సహా మొత్తం 10 మంది మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రులంతా తెలంగాణలోని మెదక్ జిల్లా వాసులు కావడం విషాదకరం. రామేశ్వరం నుంచి వ్యాన్‌లో భక్తులంతా తిరిగి స్వస్థలానికి బయల్దేరినపుడు పుదుకొట్టై జిల్లాలోని తిరుమయ్యం బైపాస్ రోడ్డు వద్ద ఈ ప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో 15 మంది అయ్యప్ప భక్తులు ఏపీ28 టీడీ 6809 నంబరు గల వ్యాన్‌లో శబరిమల నుంచి తిరిగి వస్తున్నారు. ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన కంటెయినర్ లారీ ఈ వ్యాన్‌ను ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దాంతో వ్యాన్‌లో ఉన్న ఐదుగురు భక్తులు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురిని తిరుమయ్యంలోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా దారిమధ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఐదుగురిని పుదుకొట్టై వైద్యకళాశాల ఆసుపత్రిలో చేర్చినట్లు పోలీసులు తెలిపారు. కంటెయినర్ లారీని అక్కడే వదిలేసి డ్రైవర్ ప్రమాదస్థలి నుంచి పారిపోయాడు. మృతదేహాలను తిరుమయ్యం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచారు. పుదుకొట్టై కలెక్టర్ ఎస్. గణేశ్, ఎస్పీ సెల్వరాజ్ ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. తిరుమయ్యం పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదం గురించి తెలియగానే తమిళనాడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విజయ్ భాస్కర్ క్షతగాత్రులు చికిత్సపొందుతున్న ఆసుత్రికి చేరుకున్నారు. బాధితుల్ని పరామర్శించి.. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులను జిల్లా కలెక్టర్ గణేష్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన సమయంలో వ్యాన్‌లో 16 మంది అయ్యప్ప భక్తులు ఉన్నట్లు సమాచారం. మృతులను మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం కాజీపేట, మంతూరు గ్రామాలకు చెందిన అయ్యప్పభక్తులుగా గుర్తించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

తెలంగాణ అధికారుల ఆరా..

ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే తెలంగాణ అధికారులు తమిళనాడు అధికారులతో మాట్లాడారు. మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి పుదుకొట్టై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతుల వివరాలు.. నాగరాజు(35), మహేశ్(28), కుమార్(22), శ్యామ్, ప్రవీణ్, కృష్ణ, సాయి, ఆంజనేయులు, సురేశ్, వ్యాన్ డ్రైవర్

మాజీమంత్రి హరీశ్ దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తుల మృతిపై మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహాలు స్వస్థలాలకు చేరేలా ఏర్పాట్లు చేయాలని పుదుకొట్టై కలెక్టర్ గణేశ్‌ను ఫోన్‌లో కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రమాదం దురదృష్టకరమని, భక్తులు ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పందెంకోళ్లు.. సై!

(మొదటి పేజీ తరువాయి)



నిషా ఎక్కువైన తర్వాత.. చేతివేళ్లతోనే కథలు నడిపిస్తారు. ఒక వేలు చూపిస్తే... లక్ష, రెండు వేళ్లు చూపిస్తే... పదిలక్షలు. కాకపోతే ఒక్కో ఏరియాలో ఈ ఫిగర్ ఒక్కోలా ఉంటుంది. కోడిపందేలే కదా అని చిన్న చూపు అక్కర్లేదు. ఎందుకంటే ఇవి ఈ మధ్య క్రికెట్ బెట్టింగ్‌ను మించిపోతున్నాయి. ఒక్కో ఊళ్లో కోట్ల రూపాయలు చేతులు మారతాయి.

కుక్కుటేశ్వరునికి ప్రతీక...

ఈ కోడి పుంజును కుక్కుటేశ్వరస్వామికి ప్రతీకగా కొలుస్తారు జనం. అందుకే పెద్ద పండగకి సంప్రదాయంగా వీటితో పోటీలు ఏర్పాటు చేసుకుంటామని చెబుతారు. పెళ్లిళ్లకు కూడా లేనంత హంగామా వీటికుంటుంది. ఎప్పుడు పడితే అప్పుడు పందాలను ఏర్పాటు చేసేయరు. దానికీ ఓ లెక్కుంటుంది. పంచాంగం చూసి... ముహూర్తాలు పెట్టించి మరీ కోళ్లను బరిలోకి దించుతారు. రంగు డామినేషన్ బట్టికూడా పందెం కొట్టుకొస్తుందని వీరి నమ్మకం. వాటి రంగు, పోరాడే సమయంలో నక్షత్రం బట్టి ... 24 గంటలను భాగాలుగా లెక్కించి ఏ రంగు పుంజు పందెం నెగ్గుతుందో కూడా లెక్కలు వేస్తారు. పౌర్ణమి దగ్గరగా ఉంటే తెలుపు రంగు పుంజులు కసిగా కుమ్ముతాయని, అమావాస్య దగ్గరగా ఉంటే నలుపు రంగు పుంజులు కేక పుట్టిస్తాయని వీరి లెక్క. కోళ్లకు సంబంధించిన కుక్కుటశాస్త్రం పుస్తకాలు కూడా ఇక్కడ విపరీతంగా అమ్ముడుపోతాయి. కోడి పుంజులను తెల్ల కళ్లవి, నల్ల కళ్లవి అంటూ డివైడ్ చేస్తారు. నల్లకళ్లవాటికి పోరాడే శక్తి అధికంగా ఉంటుందట. కోడి పుంజు తలపై ఉండే కిరీటం ఏడు వరసలు ఉంటే దానికి తిరుగులేదని చెబుతారు.

పందేలకు ఏ పుంజులు..

పందేలకు కొన్ని రకాల పుంజులే పనికొస్తాయి. కెక్కిరాయి, రసంగి, ఏరువా, మైల, అబ్రాక్, పర్లా, సవలాలు, పతంగి, ఎర్రకచ్చురాయి, నల్లకచ్చురాయి, ఊడిద, డేగ, పండుడేగ, ఇసుకడేగ, నెమళ్లు, కాకులు, తీతువ, జీడిపప్పు దండిగా తినే కాజు రకం కోళ్లు ఉన్నాయి. రెండు మూడు రంగులు కలసి ఉన్న వాటిని కాకిడేగ, పచ్చకాకి, తింగ్లా, దుగడా, ఎర్రమైలా, నల్లమైలా, ఎర్రకిక్కర, నల్లకిక్కర పర్లానెమలి.. ఇలా అంటారు. వీటికి ప్రతిరోజూ బాదంపప్పు, జీడిపప్పు, పిస్తాలతోపాటు.. నవధాన్యాలతో చేసిన చపాతీలు పెడతారు. చంటిపిల్లలను సాకినట్లు పెంచుతారు. చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు పదిరోజుల పాటు నూకలు వేస్తారు. నెమ్మదిగా గంట్లు కూడా పెడతారు. వడ్లు ఆడించి చోళ్లు కలిపి కూత పెట్టే సమయానికి రెండు నెలలపాటు మేత కింద వేస్తారు. పందానికి 40 రోజుల ముందు నుంచి ఉదయాన్నే కోడిగుడ్డులోని తెల్లసొన, విటమిన్ టాబ్లెట్లు, చోళ్ళు, జొన్నలు, గంటెలు, రాగులు, సజ్జలు, జీడిపప్పు, బాదం పప్పులతో బాగా మేపుతారు. మెరుపులు, గోధుమలు, కిస్మిస్ కూడా ఇస్తారు. నెలకి ఒక్కో పుంజుకు రూ. 5-8 వేల వరకు మేతకే ఖర్చవుతుంది. ఒకేచోట నిలబెట్టడం వలన కాళ్లల్లో శక్తి దెబ్బతింటుందని నెట్ కట్టి పుంజును అటూ.. ఇటూ తిప్పుతారు. ఒక విధంగా పుంజుకు వాకింగ్ చేయిస్తారు. కొవ్వు పట్టకుండా వేడి నీళ్లల్లో వేప, జామ, వెదురు ఆకులు, పసుపులను కలిపి మరగపెట్టి బాలింతకు నీళ్లు పోసినట్లు తడిసిన గుడ్డ కోడి చుట్టూ తిప్పి గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేయిస్తారు. పుంజు కొద్దిగా నీరసించినట్లు కనిపించినా.. మెడను కదపలేక మేతను తినలేకపోయినా తక్షణమే వైద్యం చేయిస్తారు.

శిక్షణ ఇలా...

ఇవి కూతకొచ్చాక మొదలవుతుంది అసలు కథ. మిలట్రీలో సైనికులకు ఇచ్చినట్టు.. కఠోరమైన శిక్షణ ఇస్తారు. ప్రతిరోజూ ఈత తప్పనిసరి. పందెంలో వీటి సత్తా చూసేందుకు ముందు మామూలు కోళ్లతో, తర్వాత పందెం పుంజులతో ప్రాక్టీసు ఉంటుంది. శారీరక సామర్థ్యం, ఎక్కువసేపు నిలబడగలిగే సత్తాను బట్టి వీటి రేటు 10 వేల నుంచి 50 వేలపైనే పలుకుతుంది. పెట్టల వైపు కన్నెత్తి చూడకుండా ఉండడానికి పందెం కోళ్లను ప్రత్యేక మైదానాలలో, పెద్ద పెద్ద గాపులలో ఉంచుతారు. వయసొచ్చిన తరువాత ఇవి పెట్టలపైకి వెళితే... దెబ్బలాడే సామర్థ్యం పోతుందని ఇలా చేస్తారు. పందెంకోడికి కదనరంగంలో తిరుగులేని వజ్రాయుధం కత్తి. ఒక్కోసారి ఒకే దెబ్బకు అవతలి పుంజు తల ఎగిరి పడుతుంది. ఓ ప్రాంతంలో స్టీలు, మరో ప్రాంతంలో విమానానికి వాడే ఐరన్ కూడా ఈ కత్తుల తయారీకి వాడతారు. దీంతోపాటు మైలుతుత్తం, యాసిడ్, ఇంకొన్నింటినీ దీనిలో కలుపుతారు. వీటిని గోగునార తాడుతో కడతారు. నెలల తరబడి వీటిని ఊరబెట్టి నారగా తయారు చేసి దాన్ని తాడుగా పేని మరీ వీటికి వాడతారు. పందెం కోళ్లకు కత్తి కట్టేవారికి ఒక్కో కోడికి వందరూపాయలు, ప్లస్ ఓ తొడ ఇవ్వాల్సిందే. ఇక పందెంలో నెగ్గితే వాళ్లు సంతోషంతో ఇచ్చే మొత్తం దీనికి అదనం. రోజుకు 50 -100 కోళ్లకు కత్తులు కడతారు. అంటే వీళ్ల ఆదాయం రోజూ వేలల్లో ఉంటుందన్నమాట. ఇక పందెం కోళ్లకు కొందరు మందు కూడా పట్టిస్తారు. దీనివల్ల.. ఇవి ఎక్కువసేపు బరిలో నిలబడి పోట్లాడతాయని, కత్తిగాట్లు పడ్డా... మత్తులో వాటి బాధ తెలియక త్వరగా పడిపోకుండా ఉంటాయి. పందెంలో అటువైపు కోడికి దెబ్బలు తగిలి.. ఇటువైపు కోడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నా నిలబడి ఉంటే... ఇదే గెలిచినట్లే.

జాంపేట మార్కెట్ జాం జాం..

కోడి పుంజుల అమ్మకాలకు పెట్టింది పేరు... రాజమండ్రి జాంపేట మార్కెట్. అసలిక్కడ దొరకని కోడి పుంజు అంటూ ఉండదు. పందెం కోళ్లలో ఎన్ని రకాలు ఉన్నా.. కాకులు, సవలాలు లాంటి పుంజులకు గిరాకీ ఎక్కువ. ఉభయగోదావరి జిల్లాలలతో పాటు చాలాచోట్ల నుంచి ఇక్కడకే వచ్చి కొంటుంటారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, అమలాపురం, రావులపాలెం, రాజమండ్రి, కోరుకొండలో పందేలు జోరుగా సాగుతాయి. ఇక గోపాలపురం, పోలవరం, గోకవరం, సీతానగరంతో పాటు ఏజెన్సీలో రంపచోడవరంలాంటి ప్రాంతాల్లోనూ ఈ ఫైటింగ్ సీన్లు కనిపిస్తాయి.

భారీ ఏర్పాట్లు


సంక్రాంతి మూడు రోజులూ ఉభయగోదావరి జిల్లాల్లో కోడిపందాల నిర్వహణ ఒక ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడి పందాలను తిలకించడానికి విదేశాల నుంచి సైతం అతిథులు తరలివస్తారు. షామియానాలు, ఎయిర్ కూలర్ల వంటి ఏర్పాట్లతో ఆ మూడు రోజులు ఒక శుభకార్యంలాగా చేస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సినీ ప్రముఖులు కోడిపుంజులను పట్టుకుని పందాల్లో పాల్గొనడం ప్రత్యేకత.

కోసు పందేలతో కొంయ్.. కొంయ్..

కోడి పందాల్లో రెండు రకాలుంటాయి. కోసు పందాలు, జట్టీ పందాలు. కోసు పందాల్లో అయితే పందెం కింద పదికి యాభై, వంద ఇలా డబుల్, ట్రిపుల్ అమౌంట్లు ఉంటాయి. అంటే పది రూపాయల పందెం కాసినపుడు ఓడిపోతే పది రూపాయలే పోతాయి. కానీ గెలిస్తే మాత్రం 50, 100 రూపాయల చొప్పున వస్తాయి. దాంతో ఎక్కువ మంది ఆశతో ఈ తరహా పందేలు కాస్తారు. దానికితోడు.. ఈ విభాగంలో పోటీకి దిగే కోళ్ల కాళ్లకు కత్తులుంటాయి. పోటీలు నిర్వహించేవాళ్లే ఈ కత్తులిస్తారు. పోటీదారులే కొన్నిసార్లు పదును కత్తులు తెచ్చుకుంటారు. అవి గుచ్చుకుంటే అవతలి కోడికి ప్రాణం పోయినట్టే. కొన్ని సందర్భాల్లో తినడానికి కూడా పనికిరానంతగా ఆ మాంసం ఛిద్రమవుతుంది. ఇక జట్టీ పందాలలో కోళ్ల కాళ్లకు కత్తులు ఉండవు. అందుకే ఇవి చాలా తక్కువగా జరుగుతాయి. గోదావరి జిల్లాల్లో పండగ నాలుగు రోజులపాటు వేలాది కోడింపుంజులు పందెంరాయుళ్ల సరదాలకు బలైపోతాయి. పందెంలో ఓడిపోయి.. చనిపోయిన కోడిని కోజా కోడి అంటారు. దీనిలో ఓ తొడ భాగాన్ని కత్తికట్టినవాడికి ఇచ్చేస్తారు. మిగిలిన భాగాన్ని యజమానులు తీసుకెళ్తారు. దీని టేస్ట్ చాలా బాగుంటుందని... వేల రూపాయలు పెట్టి మరీ కొంటారు భోజనప్రియులు.

చెట్లకు విషప్రయోగం!

(మొదటి పేజీ తరువాయి)



బొరివాలి రాజేంద్ర నగర్ ప్రాంతంలో మాత్రం.. చెట్లకు విషప్రయోగం జరుగుతోంది! ఈ విషయాన్ని స్థానికులే నేరుగా బృహన్ముంబై మునిసిపల్ కార్పొరేషన్ వర్గాలకు ఫిర్యాదుచేశారు. చెట్ల అట్టడుగు భాగంలో డ్రిల్లింగ్ చేసి, వాటిలోకి విషాన్ని ఎక్కిస్తున్నారని, దానివల్ల చెట్లు చచ్చిపోతున్నాయని ఫిర్యాదులో తెలిపారు. డిసెంబరు 25వ తేదీన సాయంత్రం 5.30 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు తమ ప్రాంతానికి వచ్చారని, ఎందుకొచ్చారని అడిగితే ఒక బిల్డర్ తమను ఈ ప్రాంతంలో సర్వేచేసి, అంతా శుభ్రం చేయమని పంపారన్నారని ఈ ప్రాంతానికి చెందిన అంకితా కదమ్ చెప్పారు. తర్వాత చూస్తే.. వాళ్లు చెట్ల అడుగుభాగంలో డ్రిల్లింగ్ చేస్తూ దానిలోకి ఏదో ద్రవం ఎక్కిస్తున్నారని అన్నారు. ఆ సమయానికి తాను ఒంటరిగా ఉండటంతో వాళ్లను ఆపడం, జోక్యం చేసుకోవడం సరికాదని భావించి ఆగిపోయానని తెలిపారు. ఇదే ప్రాంతానికి చెందిన అనిల్ కదమ్ అనే మరో వ్యక్తి కూడా తాను ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఇలాంటిదే చూశానని, అయితే హడావుడిలో వాళ్లను ఏమీ అడగలేదని అన్నారు. తర్వాత ఆ చెట్ల ఫొటోలు తీసుకుని, మునిసిపల్ అధికారులకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదుచేశామన్నారు. త్వరలోనే సర్వే చేస్తామని వాళ్లు చెప్పినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక కార్పొరేటర్ శిల్పా చోగ్లే పోలీసులకు, ముంబై కార్పొరేషన్‌కు ఫిర్యాదుచేసి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై ఒక ఎఫ్ఐఆర్ దాఖలుచేసి, తగిన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని కస్తూర్బా పోలీసులను ఆమె కోరారు. మహారాష్ట్ర హౌసింగ్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ భూమిలో ఈ ఘటన జరిగిందని, ఇక్కడ చాలా పెద్ద పెద్ద చెట్లున్నాయని ఆమె తెలిపారు. ఈ చెట్లకు ఏదో ఒక రకం ద్రవంతో విషం ఎక్కించడానికి నిందితులు ప్రయత్నించారని, ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు కూడా ఉన్నాయని అంటూ.. తగిన చర్యలు తీసుకోవాలని చోగ్లే కోరారు.

మావల్లే రాజ్యాంగ సవరణలు

విజయవాడ, జనవరి 6: ప్రజాప్రతినిధులు లేకపోయినా తాము సాధించిన విజయాలను ఏ పార్టీ సాధించలేదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అన్నారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిర్దిష్టమైన లిఖిత లక్ష్యాల కోసం లోక్ సత్తా పోరాటం చేస్తూనే ఉందని తెలిపారు. లోక్ సత్తా కృషి వల్ల మూడు రాజ్యాంగ సవరణలు జరిగాయని చెప్పారు. కానీ దేశంలో రాజకీయం, ప్రజాస్వామ్యం ఎలా ఉండాలి అనుకుంటున్నామో.. అది సాధ్యమయ్యేలా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎన్నికలన్నీ ధనస్వామ్యంగా మారాయని.. ప్రభుత్వాలు కూడా తాయిలాలు లేకుండా పాలన సాగించలేకుండా ఉన్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాల వల్ల ప్రజలకు మంచి జరిగింది చాలా తక్కువన్నారు. డబ్బుకి, రాజకీయాలకు మంచి అవినాభావ సంబంధం ఏర్పడిందని విమర్శించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో లంచం లేకుండా పనులు జరగాలని తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులంటే ప్రభుత్వాలు భయపడుతున్నాయని, వారికి పని చేయాలని చెబితే ఎక్కడ ఉద్యోగుల ఓట్లు పోతాయో అని మౌనంగా ఉంటున్నాయని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి ప్రజలంటే భయం ఉండాలి కానీ నేడు ఆ పరిస్థితి లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలదే హవాగా ఉంటుందని తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో లోక్ సత్తా పార్టీ బరిలో ఉంటుందో లేదో కాలమే చెపుతుందని అన్నారు.

మార్పునకు సమయం



(మొదటి పేజీ తరువాయి)

వచ్చానని, అయితే అందులో భాగంగా అధికారం కూడా వస్తే రావచ్చని చెప్పారు. ఆదివారం తమ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విజయనగరం, అనంతపురం జిల్లాల సమీక్ష సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. విజయనగరం జిల్లా వివక్షకు గురికావడానికి, వెనకబాటుతనానికి ఇద్దరు వ్యక్తులు జిల్లాను తమ గుప్పెట్లో పెట్టుకోవడమే కారణమని చెప్పారు. రాజకీయాల్లో కృతజ్ఞత అనేదే ఉండదన్నారు. గత ఎన్నికల సమయంలో విజయనగరంలో పర్యటించి ఎంపీగా అశోకగజపతి రాజు విజయానికి కృషి చేస్తే చివరికి పవన్ ఎవరో తనకు తెలియదన్నారని.. దాంతో తాను విజయనగరంలో సభ పెట్టినప్పుడు ముందుగా తనను తాను పరిచయం చేసుకోవడంతో అశోక గజపతిరాజు సామాజిక వర్గం వారు అది తమను బాధించినట్లు చెప్పారన్నారు. అయితే తాను విమర్శించింది అశోక గజపతిరాజునే తప్ప ఆయన కులాన్ని కాదని వారికి చెప్పినట్లు తెలిపారు. కుల ఘర్షణల వల్ల కుటుంబాలు బాగుపడతాయి గానీ కులాలు, సమాజం నష్టపోతాయని చెప్పారు. జనసేన పార్టీ ఓటు ద్వారా మార్పు తీసుకురావాలనుకుంటోంది గానీ కులాల ద్వారా కాదన్నారు. ఆలోచింపజేయడమే రాజకీయాల లక్ష్యమని.. పోరాటం ద్వారానే మార్పు సిద్ధిస్తుందని.. ఆ ప్రక్రియలో భాగంగా అధికారం కూడా రావచ్చని పవన్ చెప్పారు. రాజకీయాల్లో రాణించాలంటే నాయకులకు, కార్యకర్తలకు ఓపిక, సహనం అవసరమని.. అప్పుడప్పుడు అవమానాలు కూడా ఎదురవుతూ ఉంటాయని అంటూ, అందుకు ఉదాహరణగా జయలలిత, మమతా బెనర్జీలను చెప్పారు. అవమానాలు తట్టుకునే శక్తి ఉండాలని తెలిపారు.ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని.. కొత్త రక్తం రాజకీయాల్లోకి వచ్చినప్పుడే మార్పు సాధ్యం అవుతుందని అన్నారు. తాను నిబద్ధత కలిగిన యువత కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. అనంతపురం జిల్లాలో వర్షాలు లేక, పంటలు పండక కరువు వల్ల వలసలు ఉంటాయని.. మరి పచ్చని పంటలతో కళకళ లాడే విజయనగరం జిల్లా నుంచి జనం ఎందుకు వలసలు పోతున్నారో మనం అర్థం చేసుకోవాలని అన్నారు. జిల్లాలోని ఆధిపత్య రాజకీయాలే ఈ పరిస్థితికి కారణమని విశ్లేషించారు. అనంతరం ఆయన అనంతపురం జిల్లా నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. చాలామంది తనను 'నీ బలం అంతా కోస్తా జిల్లాల్లోనే' అని ఓ ప్రాంతానికే పరిమితం చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటారుని, అనంతపురం కవాతు అది నిజం కాదని రుజువు చేసిందని పవన్ అన్నారు. బ్రిటిష్ హయాంలో అత్యధికంగా పన్ను కట్టిన ప్రాంతం అనంతపురం జిల్లా అని గుర్తుచేశారు. గొప్ప పేరున్న గ్రంథాలయాలతో సరస్వతీ నిలయంగా ఉన్న జిల్లాలో కాలక్రమేణా దౌర్జన్యం చేసే వారు పెరిగిపోయారని... అందరికీ అనంత పేరు చెప్పగానే ఫ్యాక్షన్ గుర్తుకు వస్తుంది గానీ తనకు తరిమెల నాగిరెడ్డి గుర్తుకు వస్తారని చెప్పారు. అవకాశాలు లేని చోట కసి ఉంటుంది, ఆకలి ఉన్న చోట ఆలోచనలు ఎక్కువగా ఉంటాయని.. అటువంటి ఆలోచనలు ఎక్కువగా ఉన్న జిల్లా మన అనంతపురమని అన్నారు. అనంతపురంలో నెలకొన్న కరవును ఒక్క రోజులో పరిష్కరించలేమంటూ... నీరే లేని ఇజ్రాయిల్ దేశం గొప్ప ఆలోచనలతో పుష్కలంగా పంటలు పండిస్తున్నప్పుడు అనంతలో మనం ఆ ప్రయోగం ఎందుకు చేయలేమని ప్రశ్నించారు. పాలకులకు సంకల్పం లేకే దీనిపై దృష్టి పెట్టడం లేదుని చెప్పారు. వ్యక్తి ఆధారిత పార్టీలు ఏదో ఒక రోజున దెబ్బతినక మానవని.. బలీయమైన భావజాలంతో ఏర్పాటైన పార్టీలు చిరకాలం మిగిలిపోతాయని, అలాంటి పార్టీ జనసేన పార్టీ అని చెప్పారు. అనంత ప్రజలు, యువత మార్పుని బలంగా కోరుకుంటున్నారన్నారు.

తెలంగాణ వాసిపై కాల్పులు

- అమెరికాలోని డెట్రాయిట్‌లో ఘటన
- కారు, వస్తువులు దోచుకుని పరార్
- ఇంజనీర్‌గా పనిచేస్తున్న సాయికృష్ణ
- పరిస్థితి విషమం.. ఆసుపత్రిలో చికిత్స

హైదరాబాద్, జనవరి 6: అమెరికాలో మరో తెలుగు వ్యక్తిపై దుండగులు దాడి చేశారు. డెట్రాయిట్‌లో ఎలెక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తెలంగాణ వాసి సాయికృష్ణపై దొంగలు కాల్పులు జరిపి.. ఆయన కారుతో సహా విలువైన వస్తువులు దోచుకుని పారిపోయారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. డెట్రాయిట్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సాయి కృష్ణ పని ముగించుకుని రాత్రి పూట కారులో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. దొంగలు సాయికృష్ణ కారును ఆపి, బలవంతంగా లోపలకు ప్రవేశించారు. నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లాలని ఆయనను బెదిరించారు. అక్కడికి వెళ్లిన తర్వాత సాయికృష్ణ నుంచి కారు, వాలెట్, ఇతర విలువైన వస్తువులు లాక్కొన్నారు. అనంతరం కాల్పులు జరిపి కారులో పారిపోయారు. విపరీతమైన చలిలో రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న సాయికృష్ణను గమనించిన ఓ వ్యక్తి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. సౌత్‌ఫీల్డ్ మిచిగాన్‌లోని లారెన్స్ టెక్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన సాయికృష్ణ డెట్రాయిట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. విషమ పరిస్థితిలో ఉన్న సాయికృష్ణ కోలుకోవడానికి సర్జరీలు చేయాల్సివుందని, చికిత్స కోసం విరాళాలు సేకరిస్తున్నట్టు ఆయన స్నేహితుడు శ్రుజిత్ తెలిపారు.

12 గంటల్లో ముంబై నుంచి ఢిల్లీకి!

- మార్చ్‌లో ప్రారంభం కానున్న పనులు
- 2022కల్లా పూర్తికానున్న ఎక్స్‌ప్రెస్ కారిడార్
- దేశంలో అతిపెద్ద ఎక్స్‌ప్రెస్ హైవే

ముంబై, జనవరి 6: దేశ రాజధాని న్యూఢిల్లీ నుంచి వాణిజ్య రాజధాని ముంబైకు ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణ పనులు మార్చిలో ప్రారంభం కానున్నాయి. అత్యంత వేగంగా ఈ నిర్మాణ పనులు జరుగుతాయంటూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్) వెల్లడించింది. దేశంలోనే అతిపెద్ద ఎక్స్‌ప్రెస్ హైవేగా దీన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నారు. ఐదు రాష్ట్రాల గుండా సాగే ఈ రహదారి 'సిగ్నల్ ఫ్రీ యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్'గా ఉండబోతోందని అధికారులు వివరించారు. ప్రస్తుతం ముంబై నుంచి ఢిల్లీ చేరేందుకు 25 గంటల సమయం పడుతుండగా ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంతో కేవలం 12 గంటల్లో ఈ ప్రయాణం పూర్తికానుండడం విశేషం. హర్యానా, రాజస్థాన్‌ల్లో మొత్తం 173 కిలోమీటర్ల రోడ్డు ఆరు దశల్లో నిర్మించేందుకు బోలెడు బిడ్లు ఇప్పటికే తమకు అందినట్టు, ఈ నెలాఖరులోగా బిడ్ల ఖరారు ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టంచేశారు. ఫిబ్రవరి రెండవ వారాంతానికి మరో 22 దశల నిర్మాణంపై కసరత్తు పూర్తికానుంది. ఫిబ్రవరి 15 నుంచి మార్చ్ రెండవ వారంలోగా ఏ క్షణమైనా పనులు ప్రారంభం కావచ్చని ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది. గతేడాది ఏప్రిల్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముంబై-ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ హైవేపై తొలిసారి ప్రకటన చేస్తూ మార్చి 2022కల్లా దీన్ని పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.



శ్రీవారి నిత్యోత్సవాలు

- ఈ నెల 20 నుంచి పున్నమీఘాట్‌లో
- సుప్రభాత సేవ.. ఏకాంత సేవ వరకు
- తిరుమల తరహాలో ప్రత్యేక పూజాధికాలు

విజయవాడ, జనవరి 6: ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీ లక్ష్మీ శ్రీనివాసా వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో నవ్యాంధ్రప్రదేశ్ పాలకులు శ్రీవారి నిత్యోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కృష్ణా తీరంలోని పున్నమీఘాట్‌లో నిర్వహించనున్నట్టు శ్రీ లక్ష్మీ శ్రీనివాసా వాసవి సేవా సమితి అధ్యక్షుడు దూపుగుంట్ల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గరిమెళ్ళ నానయ్య చౌదరి (నాని) తెలిపారు. ఆదివారం ఉదయం పున్నమీఘాట్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో శ్రీవారి నిత్యోత్సవాలను నగరంలోని స్వరాజ్య మైదానంలో, పటమట రైతుబజార్‌లో అత్యంత వైభవంగా నిర్వహించామని తెలిపారు. నిత్యోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సూర్యోదయానికి పూర్వం సుప్రభాత సేవ మొదలు రాత్రి ఏకాంత సేవ వరకు తిరుమలలో కొలువైన అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వర స్వామివారికి జరిగే తరహాలో భక్తులను భాగస్వామ్యం చేస్తూ తిరుమల తరహాలో ఇక్కడ కూడా అన్ని పూజాధికాలు, ఆర్జిత సేవలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ 500 జంటలను కల్యాణోత్సవంలో ఎటువంటి రుసుము లేకుండా భాగస్వాములను చేస్తామని చెప్పారు. ప్రత్యేక పూజలనంతరం భక్తులకు అన్నప్రసాదంతో పాటు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో శ్రీ లక్ష్మీ శ్రీనివాసా వాసవి సేవా సమితి ప్రధాన కార్యదర్శి మామిడి లక్ష్మీ వెంకట కృష్ణారావు, గౌరవాధ్యక్షురాలు మానేపల్లి లక్ష్మీకుమారి, కోశాధికారి ఉదయగిరి శ్రీనివాసులు, పలువురు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి తీసుకెళ్లండి



- ప్రజా సంక్షేమం కోసం కేంద్ర పథకాలు
- వీటిని నేరుగా ప్రజలకే వివరించండి
- 2019లో మళ్లీ బీజేపీ గెలిచేలా కృషి
- ఏపీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- అనంత బీజేపీ శ్రేణులకు మోదీ నిర్దేశం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి

అనంతపురం, జనవరి 6 (మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. రాష్ట్రంలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల బూత్ కమిటీ సభ్యులు, పతాధికారులతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. పలువురు కార్యకర్తలతో ముఖాముఖి మాట్లాడి వారు అడిగిన ప్రశ్నలకు.. సమాధానాలిచ్చారు. అనంతపురం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అనంతపురం పార్లమెంట్ పరిధిలోని బూత్ కమిటీ సభ్యులు, పతాధికారులతో ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ మాట్లాడారు. కార్యక్రమానికి రాష్ట్ర ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యులు మురళీధరరావు, నెహ్రూ యువకేంద్ర జాతీయ ఉపాధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అంకాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రధాని మోదీ అనంతపురం జిల్లా శ్రేణులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లాకు చెందిన తేజస్విణి.. ప్రత్యేక హోదా విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రంపై చేస్తున్న ప్రచారంపై ప్రధాని దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్పందించిన ప్రధాని.. ఏపీ రాష్ట్రంలో మోసకారి ప్రజా పాలన కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే అధికారం రక్షించుకోవడం కోసం చంద్రబాబునాయుడు కాంగ్రెస్‌తో జత కట్టారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కంటే కుమారుడు లోకేష్ అభివృద్ధి కోసం రాష్ట్రాన్ని ఫణంగా పెడుతున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మాధ్యమాల్లో ప్రచారం పట్టించుకోకుండా పథకాలను నేరుగా ప్రజలకే వివరించాలన్నారు. 2019లో కేంద్రంలో అధికారంలోకి బీజేపీ తిరిగి వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ కార్యకర్తలు, నేతలపై జరుగుతున్న దాడులపై ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోవాలని సూచించారు. బీజేపీ కార్యకర్తలను తక్కువగా అంచనా వేయకూడదని, దేన్నైనా తట్టుకునే శక్తి బీజేపీ కార్యకర్తలకు ఉందన్నారు. 1994లో కేవలం రెండు ఎంపీ స్థానాలు మాత్రమే బీజేపీకి వచ్చాయని, అందులో ఒకరు ఆంధ్రప్రదేశ్ నుంచి ఉన్నారని, దీన్ని ఎదుర్కొని తక్కువ సమయంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన చరిత్ర బీజేపీదన్నారు. బీజేపీ అగ్రవర్ణాలు, హిందీ రాష్ట్రాల పార్టీగా జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, హిందీ మాట్లాడని దక్షిణాది రాష్ట్రాల్లో కూడా అధికారం చేజిక్కించుకుందని, అగ్రవర్ణాలతోపాటు అన్ని వర్గాల వారు బీజేపీలో ఉన్నారన్నారు. త్రిపురలో జీరో స్థాయి నుంచి అధికారం చేజిక్కించుకునే స్థాయికి ఎదిగామన్నారు. అదేస్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన కార్యకర్తలకు ముఖాముఖిలో చర్చించారు.

18న అమిత్‌షా పర్యటన

బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా ఈనెల 18వ తేదీన రాష్ట్రంలో పర్యటించనున్నారని రాష్ట్ర ఇన్‌ఛార్జ్, రాజ్యసభ సభ్యులు మురళీధర్‌రావు తెలిపారు. ప్రధాని మోదీ నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. అమిత్‌షా పర్యటనపై ఈనెల 9న రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కోర్ కమిటీ సమావేశమై పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తారన్నారు. ఆమిత్‌షా పర్యటనలో బూత్‌లెవల్ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారన్నారు. రెండో విడత ముఖాముఖి కార్యక్రమాన్ని ఆదివారం ప్రధాని నిర్వహించారని, భవిష్యత్‌లో కూడా ముఖాముఖి ప్రధాని కొనసాగిస్తారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రజలతోనూ, బీజేపీ మహిళా కార్పొరేటర్‌తో వ్యవహరించిన తీరు సమంజసం కాదన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు తీరును ప్రజలు అర్థం చేసుకుని తగిన తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే బీజేపీ నేతలపై టీడీపీ ప్రభుత్వం దాడులు చేయిస్తోందని, ప్రజాస్వామ్యబద్ధంగా వీటిని ఎదుర్కొంటామని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. యువత మార్పు కోరుకుంటున్నారని, బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఆ దిశగా తాము పయనిస్తున్నామని పేర్కొన్నారు.

అన్యాయంగా రాష్ట్ర విభజన

- రాష్ట్రానికి ఇబ్బందులు, ఆర్థిక లోటు
- అయినా అభివృద్ధి దిశగా అడుగులు
- చంద్రబాబు అనుభవంతో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు
- చిత్తూరు పర్యటనలో మంత్రి లోకేష్



సత్యవేడు, జనవరి 6: రాష్ట్ర విభజన అన్యాయంగా జరిగిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నో కష్టాల్లో ఉన్నా, ఆర్థిక లోటు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడా జరగని రీతిలో అమలు చేస్తున్నారని అన్నారు. ఆదివారం చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటురు మండల కేంద్రంలో పిచ్చాటురు పంచాయితీ జన్మభూమి మావూరు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మా తెలుగుతల్లి ప్రార్థన గీతం అనంతరం సభలో ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలు అమలులో పారదర్శకత ఉండాలని నూటికి వంద శాతం ప్రజలు సంతృప్తిగా ఉండాలని ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడుతుంటారని, నిరంతరం ప్రజాసంక్షేమమే ఆయన ఆశయం అని అన్నారు. రాజధాని లేని, లోటు బడ్జెట్‌తో ఏపీ ఏర్పడిందని, అయినా ఇచ్చిన మాట మేరకు దేశంలో చేయని విధంగా రైతు రుణమాఫీ 24 వేల కోట్లు చేశారని అన్నారు. 2014లో ఉమ్మడి రాష్టంలో 50 లక్షల మందికి 200 రూపాయలు పింఛన్లు ఇస్తుంటే, దాన్ని 1000 రూపాయలకు పెంచి నవ్యాంధ్రలో 54 లక్షల మందికి పారదర్శకంగా బయోమెట్రిక్ ద్వారా ఇస్తున్నామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు పసుపుకుంకుమ పేరుతో రూ.10 వేలు అందించిన ఘనత మన ముఖ్యమంత్రిదేనని అన్నారు. విభజన చట్టంలో పోలవరం జాతీయ ప్రాజెక్టు అని ఉంటే, 2014లో 10 శాతం పూర్తి అయితే నేడు 68 శాతం పూర్తి చేసి రూ 10 వేల కోట్లు ఖర్చు చేశామని, కేంద్ర ఇంకా రూ.3500 కోట్లు ఇవ్వలేదని అన్నారు. నదుల అనుసంధానంతో పట్టుసీమ చేపట్టి కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, కృష్ణా జలాలను రాయలసీమ జిల్లాలకు వాడుకుంటున్నాం అని అన్నారు. సోమవారాన్ని పోలవరంగా మార్చి 30 సార్లు చంద్రబాబు పోలవరం పర్యటించారని తెలిపారు. పిచ్చాటురులో మంత్రి లోకేష్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ. 10 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం, రూ. 33 లక్షలతో నిర్మించిన మండల మహిళా సమాఖ్య భవనం, రూ 53 లక్షలతో నిర్మించిన సిడిపివో కార్యాలయ భవనం, 15.3 కిలోమీటర్లు 468 లక్షలతో నిర్మించిన మండల సిసి రోడ్లును ప్రారంభించారు. ప్రారంభోత్సవాలతో పాటు మండలంలో 5.51 కిలోమీటర్ల బిటి/సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. మంత్రి ప్రసంగానికి ముందు లైవ్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రసంగం వీక్షించారు. ముఖ్యమంత్రి వివరిస్తూ విభజన పద్ధతిగా జరగలేదని, పోలవరం చట్టంలో పెట్టారని, ముంపు మండలాల తెలంగాణా నుంచి మార్చమని కోరి నేడు అడ్డంకులు లేకుండా డబ్బులు ఇవ్వకున్నా పనులు చేస్తున్నామని అన్నారు. నదుల అనుసంధానంతో రాయలసీమకు నీళ్లు ఇవ్వవలుగుతున్నాము.

ఫాక్స్‌కాన్ మొబైల్ కంపెనీలో లోకేష్ సందర్శన

శ్రీ సిటీలోని ఫాక్స్‌కాన్ మొబైల్ తయారీ కంపెనీని మంత్రి నారా లోకేష్ సందర్శించారు. 2015లో ఫాక్స్ కాన్ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభం కాగా, ఇప్పటి వరకూ 7.5 కోట్ల మొబైల్ ఫోన్లు తయారు చేసింది. 15 వేల మంది మహిళలకి ఒకే చోట ఉద్యోగాలు ఇచ్చింది. మంత్రి మాట్లాడుతూ.. 2014 రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి సారి కొంత మంది పారిశ్రామికవేత్తలను కలిసి పెట్టుబడులు పెట్టాలి అని ఆహ్వానించానని అన్నారు. ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు యుద్ధ ప్రాతిపదికన అనుమతులు కేటాయిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం రావాలని, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ పని చేస్తున్న 15 వేల మందిలో ఎక్కువ శాతం వారికి ఇదే మొదటి ఉద్యోగమన్నారు. రాబోయే 20 ఏళ్లలో మన దేశంలో ట్రిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ వినియోగం ఉండబోతుందని పేర్కొన్నారు. అందులో 50 శాతం ఎలక్ట్రానిక్స్ ఆంధ్రప్రదేశ్‌లో తయారు అయ్యేలా కంపెనీలు తీసుకురావాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో విడిభాగాల తయారీ కంపెనీలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు.

చంద్రబాబు, పవన్‌తో అలీ భేటీ

- చంద్రబాబుతో అరగంట ఏకాంతంగా చర్చలు
- మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయిన అలీ

అమరావతి, జనవరి 6, మనం ప్రతినిధి: ప్రముఖ సినీ నటుడు అలీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుతో భేటీ కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో అలీ చంద్రబాబుతో ఏకాంతంగా అరగంటపాటు చర్చలు జరిపారు. ఇప్పటికే వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన అలీ తాజాగా బాబు, జనసేన అధినేత పవన్‌ని కలవడం విశేషం. చంద్రబాబు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లే సమయంలో ఆయన్ని కలిసిన ఆలీ.. ఆదివారం ఉదయం పవన్ కల్యాణ్‌ని కలిశారు. వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్‌కు అలీ అత్యంత సన్నిహితుడు కాగా, టీడీపీతో ఆయనకు ఎప్పటినుంచి సన్నిహిత సంబంధాలున్నాయి. అనంతరం, మీడియాతో మాట్లాడకుండానే అలీ వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా, వైసీపీలో అలీ చేరబోతున్న వార్తలు హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఈ వరుస భేటీలు ఎందుకన్న విషయం హాస్య నటుడు అలీ అభిమానుల్లో ఉత్కంఠ రేపుతోంది. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో పోటీచేసేందుకు అలీ సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సన్నిహితులు చెబుతుండగా రాజమండ్రి నుంచి ఆయన బరిలోకి దిగతారంటూ ఊహాగానాలు సాగుతున్నాయి. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీ నేతలతో అలీ వరుసగా భేటీ అవుతుండగా ఆయన ఏ పార్టీ తీర్థం పుచ్చుకుని, ఏ పార్టీ టికెట్‌పై పోటీ చేస్తారన్న విషయంపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఓవైపు సినిమాలు, మరోవైపు బుల్లితెరపై యాంకరింగ్‌తో ప్రస్తుతం ఆయన కెరీర్ అత్యంత బిజీగా సాగుతోంది.

వసతి గృహంలో విషాహారం

- 67 మంది విద్యార్థులకు అస్వస్థత
- చేవెళ్ల కస్తూర్బా స్కూల్లో ఘటన

చేవెళ్ల, జనవరి6, మనం ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని కస్తూర్బా బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ జరిగింది. వసతి గృహంలో విషాహారం తిన్న 67 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా వీరంతా ప్రస్తుతం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. వసతి గృహంలో మొత్తం 200 మంది విద్యార్థులు ఉండగా 67 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. రాత్రి ఫ్రూట్ సలాడ్ ఇచ్చిన నిర్వాహకులు అనంతరం రాత్రి భోజనం పెట్టారు. కొద్దిసేపటి తరువాత కొందరు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురైనట్టు సమాచారం. అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ఫుడ్ పాయిజన్ జరిగిందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గిన్నిస్ రికార్డు!



- నేడు పోలవరం ప్రాజెక్ట్‌కు దక్కనున్న చోటు
- 24 గంటల్లో 30 వేల క్యూ.మీ. కాంక్రీట్ పనులు
- ప్రతి గంటకు 1200 క్యూబిక్ మీటర్లు
- నేడు పైలాన్ ఆవిష్కరించనున్న చంద్రబాబు

ఏలూరు, జనవరి 6 (మనంన్యూస్ బ్యూరో): ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పోలవరం ప్రాజెక్టును చేపట్టింది. ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ఘట్టానికి తెరలేచింది. ప్రపంచంలోనే అరుదైన రికార్డు ఆవిష్కరణ చేసుకోనుంది. గిన్నిస్ బుక్ రికార్డును కైవసం చేసుకోబోతుంది. దీని కోసం భారీ ఎత్తున కాంక్రీట్ పనులు చేపట్టింది. స్పిల్ ఛానల్ దగ్గర 24 గంటల్లో 30 వేల ఘనపు మీటర్ల కాంక్రీట్ వేయాలనే లక్ష్యంతో శర వేగంగా పనులు చేపట్టారు. చైనాలోని త్రీగార్జెస్ –13,000 ఘ.మీ.)ను, 2017లో దుబాయ్‌లో ఒక టవర్ నిర్మాణానికి 36 గంటల్లో 21 వేల 580 ఘనపు మీటర్ల కాంక్రీట్ వేయడం ప్రచంచ రికార్డుగా నమోదైంది. ఈ రికార్డులను అధిగమించే లక్ష్యంతో 24 గంటల్లో 28 వేల ఘనపు మీటర్ల కాంక్రీట్ పూర్తి చేసి 30 వేల ఘనపు మీటర్ల కాంక్రీట్ లక్ష్యంగా పనులు చేపట్టారు. పోలవరం దగ్గర అసాధారణ రీతిలో రాత్రి, పగలు సాగుతున్న కాంక్రీట్ పనుల రికార్డును నమోదు చేసేందుకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు అక్కడే మకాం వేశారు. ఉదయం 9 గంటల వరకు ఈ పని జరగనుంది. పనులను పరిశీలించడానికి జాతీయ, అంతర్జాతీయ మీడియా పోలవరం చేరుకుంది. ఈ రికార్డును గిన్నిస్ బుక్‌లో నమోదు చేయనున్నారు. రికార్డు స్థాయిలో కాంక్రీట్ పనులు చేసినందుకు గుర్తుగా నిర్మించిన పైలాన్‌ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించనున్నారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత లండన్ నుంచి గిన్నిస్ రికార్డును ప్రకటించే అవకాశం ఉంది.

నవయుగ సంస్థ ప్రపంచ రికార్డు

నవయుగ కన్‌స్ట్రక్షన్స్ కాంక్రీట్ యజ్ఞాన్ని ప్రారంభించింది. 24 గంటల సమయంలోనే 30 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. 24 గంటల్లో ఏ కట్టడానికీ వినియోగించనంత కాంక్రీటు పోసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. గిన్నీస్ బుక్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో కాంక్రీట్ పోసే ప్రక్రియ ముందుకు సాగుతుంది. ప్రతి 15 నిమిషాలకోసారి ప్రతినిధులు గణాంకాలు నమోదు చేస్తున్నారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్, స్టిల్లింగ్ బేసిన్ తదితర చోట్ల పెద్ద మొత్తంలో కాంక్రీటు పనులు చేపట్టారు. బ్లాచింగ్ ప్లాంట్లలో గంటకు 1560 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు కలిపేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి గంటకు 1200 క్యూబిక్ మీటర్ల పనులు ముందుకు పూర్తి చేస్తూ వచ్చారు. మొత్తం 3 కిలోమీటర్ల పరిధిలో 300 బ్లాకులు ఏర్పాటు చేశారు. మొత్తం బ్లాకులను 6 దశలుగా విభజించారు. ఇందుకోసం ఆధునిక యంత్ర సామాగ్రి బ్లాచింగ్ ప్లాంటు, చిల్లింగ్ ప్లాంట్, అగ్రిగేట్ కూలింగ్ ప్లాంట్ వినియోగిస్తున్నారు. ట్రాన్సిట్ మిక్సర్, అజిటేటర్, టెలిబెల్ట్, ప్లేసర్ల వంటి ఆధునిక యంత్ర సామాగ్రిని మోహరించారు. పోలవరం ప్రాజెక్టులో మొత్తంగా 36.79 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 13.36 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. 21 మంది ఇంజనీర్లు, 3,600 మంది కార్మికులు, 500 మంది సాంకేతిక నిపుణులు, 750 మంది ఇతర సిబ్బంది పనిలో నిమగ్నమయ్యారు. కాంక్రీట్ పనులకోసం 7 వేల టన్నుల సిమెంట్, 22 వేల టన్నుల ఇసుక, 36 వేల టన్నుల కంకర ఉపయోగిస్తున్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో దీన్ని నమోదు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధి విశ్వనాథ్ ఆదివారం నుంచి పనులను పరిశీలిస్తున్నారు. ఆదివారం 7 గంటల్లో 9 వేల 611 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను వేశారు. మొత్తం పనులన్నీ డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటల లోపు గిన్నిస్ రికార్డును పూర్తి చేయనున్నారు. అనుకున్న లక్ష్యానికి గంట ముందుగానే పనులు పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుని గిన్నిస్ రికార్డు సాధించాలన్న దృఢ సంకల్పంతో సంస్థ ప్రతినిధులు పనిచేస్తున్నారు. అలాగే రికార్డు నమోదుకు గిన్నిస్ బుక్ లండన్ కు సంబంధించిన ఇద్దరు అధికారుల సమక్ష్యంలో చరిత్రలో పోలవరం చిరస్థాయిగా నిలిచేలా అధికారులు కూడా అన్ని ఏర్పాట్లు చేశారు. పీ.హెచ్.డి. చేసిన మరో 8 మంది నిపుణులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. మొత్తం 24 మంది ఈ రికార్డును పరిశీలిస్తున్నారు. ప్రతి 15 నిమిషాలకోసారి బ్లాచింగ్ పాయింట్ల దగ్గర ఎంత కాంక్రీటు తయారవుతోంది. ఏయే ప్రాంతాల్లో వేస్తున్నారు. దాని క్వాంటిటీ ఎంతనే విషయాలు నమోదు చేశారు. నమోదు చేసిన వివరాలను ప్రతి గంటకు వీడియో తీసి పంపించారు. వీటన్నింటినీ లండన్ నుంచి పరిశీలించి గిన్నిస్ బుక్లో రికార్డు చేసేవరకు వెల్లడించరని, రికార్డు పూర్తయ్యాక వివరాలు తెలియజేస్తారని అధికారులు చెబుతున్నారు.



మన సాహితి

గోడలు నవ్వుతున్నాయి

పాఠశాల గోడలు ఎవరికి చెప్పుకోలేక
అలకమంత్రాన్ని జపించినట్టున్నాయి
ఇంకెన్ని బతికున్న శవాలను
నాపైన ఆరేస్తారని బోరున ఏడుస్తున్నాయి..
అటువైపుగా వెళ్తున్న నేను
తమ కన్నీటిని ఒడిసిపట్టుకుందామని
దగ్గరికెళ్ళాను.. కాసేపటికే నవ్వుతున్నాయి..
అక్కడ
కృత్రిమ వాతావరణ సొబగులు కళ్ళను కట్టిపడేస్తాయి
నటనలో ఒకరిని మించి ఇంకొకరు
లిప్‌స్టిక్ పెదవుల మాటలు..


పచ్చని పూలచెట్లు ఆత్మహత్య చేసుకుంటుంటాయి
సంవత్సరానికి ఒకటికిపైగానే..
అక్కడ మనుషులు చిన్నారి పూలచెట్లకని
గోతులు తవ్వుతారు..
అవి శవాలబొందలు..
వికృతాకారం గల దయ్యాలు
పట్టపగలే మనుషులనావయిస్తుంటాయి
ఉయ్యాల ఊగాల్సిన వర్తమాన బాల్యాన్ని
పచ్చని చెట్టుకు ఉరేస్తున్నాయి..
కొంత గతాన్ని ఊహించుకొని
భవిషత్తుకు బాటలేయాలని
కళ్ళనిండా కాటుక నింపుకుంటున్నారు..

పాఠశాలంటే రేపొద్దున
ఎన్నో జ్ఞాపకాలు కురియాలి కదా
ఆటలాడిన రోజుల్లోని మచ్చలను
అప్పుడప్పుడు తడిమిచూసుకోవాలిగదా..
ఎన్నో ఎన్నో కార్పొరేట్ వలలో బోసిపోతున్నాయి
పూర్తిగా బాల్యాన్నంతా దొంగల్లా దోచుకెళ్తున్నారు..
మునులప్పుడు పాదాలనొత్తించుకున్నారు
ఇప్పుడు వీళ్ళు ప్రాణాలనే తీస్తున్నారు..
వాళ్ళు వీళ్ళే, వీళ్ళు వాళ్ళే
ఇప్పుడింకా ముందుకు..

కిక్కిరిసిన కార్పొరేట్ పాఠశాల గది గోడలు
ఇప్పుడు కేవలం నవ్వుతున్నాయి.
పుస్తకాల భారాన్ని మోయలేక
వెన్నులు పోతున్న జబ్బలు జారుస్తున్న
పిల్లలను చూసి చూసి
పిచ్చిపట్టకనే నవ్వుతూనే ఉన్నాయి..

- తండ హరీష్ గౌడ్

'మన సాహితి'కి వ్యాసాలు, లేఖలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో హామీపత్రం జతచేసి పంపగలరు.
e-mail: manamsahiti@gmail.com



సంకట పరిస్థితిలో వేమన, వీరబ్రహ్మము లు తమ కవితా కుఠారంతో సమాజంలోని ఘోర దురాచారాన్ని చీల్చి చెండాడారు. వీరిరువురు గనుక అవతరించకపోతే తెలుగుజాతి సాంఘిక, చారిత్రక పరిణామం మరో విధంగా ఉండేదనుటలో ఆశ్చర్యం లేదు. ఇద్దరు కవులూ అన్యాయంపై దాడిచేసినవారే. విప్లవ మతప్రవక్తలే. జీవులందరూ సమానులని, మానవుణ్ణి మానవుడు హింసిం చడం కూడదనీ, నోరులేని జీవాలను వధించడం, యజ్ఞాలలో వేద దేవతలకు, జాతరలలో గ్రామ దేవతలకు బలులు ఇవ్వడం అభిమతం కాదని ఈ కవులిద్దరూ వాక్రుచ్చి నారు. ఇతరుల మనస్సు నొప్పించకూడదని వీరిమతం. 'మనసు గలుగువాడు మహనీయ తేజుడ'ని చెప్పిన వేమన్న, 'మంచిమాట చేత మనసు రంజిల్లు'నన్న వీరబ్రహ్మం గొప్ప సంస్కర్తలైనారు.

వీరబ్రహ్మం... వేమన



తత్వదృష్టితో సమాజ సముద్ధరణాన్ని కాంక్షించిన కవులలో వేమన, వీరబ్రహ్మములు అగ్రగణ్యులు. ఇరువురి రచనలు బహుళ ప్రచారాన్ని పొంది మెన్నత శిఖరాలకు చేరినవి. మానవుల మధ్య తిరుగుతూనే సత్యాన్వేషణతో మంచి చెడులను దర్శించి వారి అనుభవాలను ఆటవెలదుల్లో లోకానికి అందించారు. సమాజంలో ఉన్న బాధలకు, దుర హంకారానికి, దౌర్జన్యానికి, గర్వానికి, హైన్యానికి మూలకా రణం వర్ణవ్యవస్థ, వర్గ విభజన అనే సత్యాన్ని విప్పిచెప్పి మానవులలో ఎక్కువ, తక్కువలున్నంత కాలం చిక్కులు తప్పవని మొహమాటం లేకుండా ఇద్దరు కవులూ చెప్పా రు. సమాజంలో ఉన్న దురాచారాన్ని, దుర్మార్గాన్ని ఇద్దరూ రేవు పెట్టారు. సమాజంలోని అంధవిశ్వాసాన్ని మురికిని పోగొట్టాలంటే సంఘంలో చెలామణి అవుతున్న కల్పిత సిద్ధాంతాన్ని చీకాకు పరుస్తూ ఉతకక తప్పదు. వీరి రచనల ద్వారా తెలుగు జాతికి ఒక నూత్నతేజాన్ని అందిం చారు. అందుకే ఆంధ్రవాఙ్మయంలో వీరు అగ్రగాములుగా నిలిచారు.

ఆనాటి (17వ శతాబ్దం) రాజకీయ, సామాజిక పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. కటకము నుండి కన్యాకుమారి వరకు ఏకచ్ఛత్రాధిపత్యంతో ఏలిన కృష్ణరాయలు అస్తమించుట, తదుపరి రామరాజు పరిపాలనతో విజయ నగర సామ్రాజ్యం అంతమొందుటయు సంభవించెను. మెన్నతమైన ఆంధ్ర సామ్రాజ్యం ముక్కలై ఐకమత్యానికి దూరమై భారతీయ సంస్కృతికి ఆంధ్ర సంస్కృతికి తిలోదకాలిచ్చుటకు సిద్ధంగా ఉన్నది. ఇది అదనుగా ఆంధ్ర దేశం మహ్మదీయుల పరమైనది. వేద విరుద్ధములగు మతాచారాలు కలవారి పరిపాలనలో హిందూజాతి ఎన్నో కడగండ్లకు గురైనది. అంతేగాక అగ్రకుల, అంత్యకుల విభేదం వెర్రితలలు వేసింది. మహ్మదీయుల విషయంలో హిందువులు కూడా సహనాన్ని కోల్పోయారు. తురష్కులు మ్లేచ్ఛులని వారిస్నేహం చేయరాదని హిందువులు భావించారు.

మత భేదాలు, మతద్వేషాలు, కులభేదాలు, కులద్వేషాలు ఒక్కొక్క కులానికి సేవయే తక్క అంతకు మించిన ఉత్తమాధికారం లేదనుట, అది కారణంగా కలహాలు చెలరేగి మానవ సమాజంలో పరస్పర హింసాది క్రూర కార్యాలు పెచ్చుపెరిగి రక్తనదులు ప్రవహించుటచే శాంతి లేకపోయిన కాలమది.

ఇటువంటి సంకట పరిస్థితిలో వేమన, వీరబ్రహ్మములు తమ కవితా కుఠారంతో సమాజంలోని ఘోర దురాచారాన్ని చీల్చి చెండాడారు. వీరిరువురు గనుక అవతరించకపోతే తెలుగుజాతి సాంఘిక, చారిత్రక పరిణామం మరో విధంగా ఉండేదనుటలో ఆశ్చర్యం లేదు. ఇద్దరు కవులూ అన్యాయంపై దాడిచేసినవారే. విప్లవ మతప్రవక్తలే. జీవులందరూ సమానులని, మానవుణ్ణి మానవుడు హింసించడం కూడదనీ, నోరులేని జీవాలను వధించడం, యజ్ఞాలలో వేద దేవతలకు, జాతరలలో గ్రామ దేవతలకు బలులు ఇవ్వడం అభిమతం కాదని ఈ కవులిద్దరూ వాక్రుచ్చినారు. ఇతరుల మనస్సు నొప్పించకూడదని వీరిమతం. 'మనసు గలుగువాడు మహనీయ తేజుడ'ని చెప్పిన వేమన్న, 'మంచిమాట చేత మనసు రంజిల్లు'నన్న వీరబ్రహ్మం గొప్ప సంస్కర్తలైనారు. వీరు సమకాలీకులగుటచే వీరి రచనల్లో సామ్యం కనబడుతున్నది. బయలును గూర్చి బట్టబయలును గూర్చి ఈ యోగులిద్దరూ ముక్తకంఠంతో పలికిన సూక్తులు అచల వాదానికెత్తిన అత్యున్నత పతాకలు. వేమన్నగారి విశ్వదాభిరామ పద్యాలు వేల సంఖ్యకు పెరిగినా అచల పద్యాలు అచలంగానే ఉన్నాయి. ఈ తత్వాలు ఇంకా అన్వేషించదగినవే.

'ఆటవెలదిని ఈటెగా విసిరినదిట్ట
ఛాందస భావాలకు తొలి అడ్డుకట్ట' అయిన వేమనను కీర్తించారు బ్రహ్మంగారు.

వేమన గురించి బ్రహ్మంగారు 'కాళికాంబ సప్తశతి' లోని పద్యాలలో

అలతి యలతి పలుకు లలరించి వేమన్న
శత సహస్ర పద్యవితతి చెప్పి
భోగి యోగియై విరాగియై రాణించె
కాళికాంబ హంస కాళికాంబ ! (కా.స.శ 22)

వేదవిద్య లెల్ల బాధాకరమ్ములు
ఎంగిలింత మ్రింగ హేమమాయె
హేమమైన బ్రహ్మ వేమన్న ఒక్కడే
కాళికాంబ హంస కాళికాంబ ! (కా.స.శ 59)

పనులు చేయువేళ ఫలము మనమ్ములో
వెదకున్న వాడు వేమయోగి
ఫలము వెదకువాడు బ్రహ్మమ్ము గనలేడు
కాళికాంబ హంస కాళికాంబ ! (కా.స.శ 83)

ప్రకృతినంత తీసిపట్టి ముల్లెగ గట్టి
పెట్టెలోన బెట్టు పెద్దలరుదు
వేమనంత పెద్ద వెదకి పట్టగలాడు
కాళికాంబ హంస కాళికాంబ ! (కా.స.శ 468)

అంటూ కీర్తించారు. వేమనలాగే బ్రహ్మంగారిలోను సాంఘిక దురాచార నిరసనం, మానవతా ప్రబోధం ఉంది. కొన్ని పద్యాలయితే ఒకేభావంతో సరితూగినట్లుగా అనిపిస్తాయి.

వీరబ్రహ్మం: చెట్టు పుట్టలకును చేయెత్తి మ్రొక్కుచు
వట్టి మాటలిట్లు వదరనేల
దిట్టమైన గురుడు దేదీప్యమైయుండ
కాళికాంబ హంస కాళికాంబ! (కా.స.శ 48)

వేమన : రాతి బసవని గని రంగుగా మ్రొక్కుచు
గనుక బసవని గని గుద్దుచుంద్రు
బసవ భక్తులెల్ల పాపులు తలపోయ
విశ్వదాభిరామ వినురవేమ

వీరబ్రహ్మం:మనసు పొరలనీక మాయలబడబోక
చిలిపి రాళ్ళ పూజ చేయబోక
గురుని పూజ చేయ పరమలాభమ్మగు
కాళికాంబ హంస కాళికాంబ! (కా.స.శ 291)

వన్నెలైదు గల్గు ప్రతిమలకై గుళ్ళు
గోపురాలు కూడు గుడ్డ లిచ్చి
ప్రాణమున్నవారి పట్టించుకోరేమి
కాళికాంబ హంస కాళికాంబ! (కా.స.శ 113)

సాటిమానవునకు సాయమ్ముపడబోక
నల్లరాళ్ళు తెచ్చి గుళ్ళు కట్టి
మ్రొక్కులిడిన బ్రతుకు చక్కబడంబోదు
కాళికాంబ హంస కాళికాంబ! (కా.స.శ 291)

పై పద్యాలకు సరైన పద్యాలను వేమన కూడా చెప్పాడు.

వేమన: కొండరాళ్ళు తెచ్చి కోరిక గట్టిన
గుళ్ళలోన తిరిగి కుళ్ళనేల
పాయరాని శివుడు ప్రాణియై యుండగా
విశ్వదాభిరామ వినుర వేమ

రాతిబొమ్మ కేల రంగైన వలువలు
గుళ్ళు గోపురములు కుంభములును
కూడు గుడ్డ తాను కోరునా దేవుడు
విశ్వదాభిరామ వినురవేమ

వీరబ్రహ్మం:వేదవిద్యలెల్ల బాధాకరమ్ములు
ఎంగిలింత మ్రింగ హేమమాయె
హేమమైన బ్రహ్మ వేమన్న ఒక్కడే
కాళికాంబ హంస కాళికాంబ! (కా.స.శ 59)

వేమన: వేదవిద్యలెల్ల వేశ్యలవంటివి
భ్రమలపెట్టి తేట పడగనీవు
గుప్త విద్యయొకటి కులకాంతవంటిది
విశ్వదాభిరామ వినురవేమ

వీరబ్రహ్మం:పట్టు పట్టెనేని పట్టువిడగరాదు
పట్టువదలెనేని పదవిలేదు
పట్టివిడుచుట కంటె ప్రాణమ్ము లిడమేలు
కాళికాంబ హంస కాళికాంబ! (కా.స.శ 399)

వేమన: పట్టు పట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియ పట్టవలయు
పట్టు విడుటకంటె పడిచచ్చుట మేలయా
విశ్వదాభిరామ వినురవేమ

వీరబ్రహ్మం:ఆర్తి తీరుననుచు మూర్తమ్ము పెట్టిన
పెండ్లికూతురపుడె ముండమోయు
కంకణాలనాడె కాటికేగె మగండు
కాళికాంబ హంస కాళికాంబ! (కా.స.శ 688)

వేమన:విప్రులెల్ల జేరి కూతలు కూసి
సతిపతులను కలిపె సమ్మతమున
మునముహూర్తముంచు ముండెట్లు మోసెరా
విశ్వదాభిరామ వినురవేమ

వీరబ్రహ్మం:నోమునోచి కాచి నుదుటి వ్రాతను మాన్ప
శక్తి యుక్తుడెవడు జగతిలోన?
నోము నోచినంత నోమడు దేవుడు
కాళికాంబ హంస కాళికాంబ! (కా.స.శ 236)

వేమన: వ్రాతవెంట గాని పరమోదు దైవంబు
వ్రాత కొలది గాని చేతకాదు
వ్రాతకజుడు కర్త చేతకు తా కర్త
విశ్వదాభిరామ వినురవేమ

వేమనలా ఆటవెలదిని వీరబ్రహ్మంగారు కూడా నడిపిం చారు. వేమన గారి ఆటవెలదుల్లో 3వ పాదం చాలా శక్తివంతంగా కనిపిస్తుంది. ఆ పాదంలో ఉన్న లోక వృత్తానికి సంబంధించిన ఉపమ పఠితను కట్టిపడవేస్తుంది.

వేమన పద్యాలలాగే ఈ నాటికీ ఎంత సరికొత్తగానో కనిపించే పద్యపాదాలు కొన్ని ఈ కాళికాంబ సప్తశతిలో కనిపిస్తాయి.

పుస్తకములు చదువ పూర్ణత్వమబ్బదు
హృదయ సంపుటములు చదువవలయు(కా.స.శ 658)

వ్రతము కంటె మతికి ప్రాధాన్యమీవలె (కా.స.శ)
కులమనేటి తెగులు కొంపలు గూల్చును
(కా.స.శ 76) వంటి పద్యాలు వేమన పద్యాలకు దగ్గరి సంబంధాన్ని కలిగి ఉన్నాయి.

వెన్న కరిగిస్తే నెయ్యి అవుతుంది. అది తెలియక వెన్న చేత పట్టుకొని నెయ్యి కోసం వెదకడం అజ్ఞానమవుతుంది. తానే దైవమైన మానవుడు దైవంకోసం వెదకడం కూడా అజ్ఞానమే అన్న వేమన, కళ్లు విశ్వాన్నంతగా చూడగలవు. కాని తమను తాము చూసుకోలేవు. అలాగే మానవుడు తనలో ఉన్న దైవాన్ని చూడలేకున్నాడు. అంటూ ప్రతి మనిషి లోను దైవం ఉన్నాడు అని చాటిన వీరబ్రహ్మం ఇద్దరూ సమాజ సముద్ధరణకు పాటుపడి సామాజిక చైతన్యం కోసం తమ కవితా బాణాలను ఎక్కుపెట్టినవారే.

◆ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు
9491357842

తెలంగాణ సాహితీ చరిత్రలో చీకటి కోణాలు

జాతి జీవన విధానమే సంస్కతి. జాతి ప్రత్యేకత అస్తిత్వాన్ని నిలబెట్టేది సంస్కృతి. అయితే తెలంగాణ చరిత్ర, సాహిత్యం, సంస్కృతి వివిధ పాలకుల కాలంలో అవకాశాల పరంగానో, ఉద్దేశపూర్వకంగానో, వివక్ష కారణంగానో చాలాకాలంగా నిరాదరణకు, ఉపేక్షకు గురై అసలు తెలంగాణకు చరిత్ర, సాహిత్యం, సంపస్కృతి లేదనే స్థితికి చేరుకున్నాం. దాన్ని పునర్నిర్మించుకునే పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు అనేక చీకటి కోణాలు కనిపిస్తున్నాయి. నిజానికి అనేక చారిత్రక సంఘర్షణల మధ్య అనేకానేక ఆక్రమణల మధ్య తన అస్తిత్వాన్ని కాపాడుకున్న ప్రాంతం తెలంగాణ. ఇది తెలంగాణ విలక్షణతకు సంకేతం. ఇక్కడి సామాజిక, సాంస్కృతిక జీవితం కూడా ప్రత్యేకమే. భౌగోళికంగా, చారిత్రకంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, సాహిత్యపరంగా ఒక ప్రత్యేకతను కలిగిన ప్రాంతం తెలంగాణ.

సాధారణంగా తెలుగు సాంఘిక చరిత్ర అని అనక, అని చెప్పక, అని రాయక, ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనే పేరుతో మనకు బోధించే చరిత్ర శాతవాహనుల చరిత్రతో ప్రారంభమౌతుంది. కానీ శాతవాహనుల కన్నా పూర్వమే తెలంగాణలో అశ్మీక, మూషిక వంటి గణరాజ్యాలతో కూడిన జనపదాలు ఉన్నాయి. గోండులు చెప్పుకొనే తమ ప్రాచీనోత్పత్తి కథలో మిగిలిన ముగ్గురు దేవతలతోపాటు 'తెలింగం' అనే దేవతను కూడా పేర్కొంటారు. ఇతడే 'తెలంగం' అనే ప్రాచీన జాతి మూలపురుషుడని ఆరుద్ర అభిప్రాయం. ఖండవల్లి సోదరులు 'తలైంగు' జాతి వారి వల్ల 'తిలింగు', తెలుగు పదాలు వాడుకలోకి వచ్చాయని అభిప్రాయపడ్డారు. ఈ కోణంలో ఆలోచిస్తే కేవలం త్రిలింగ (కాళేశ్వరం, ద్రాక్షారామం, శ్రీశైలం) క్షేత్రాల మధ్య ప్రాంతమే త్రిలింగ దేశమని, త్రిలింగ శబ్దభవమైన తెలుగు అని, ఇన్నాళ్లుగా మనకు చెప్పిన జాతి భాషా వాచక పదాల చరిత్రను సోపపత్తికంగా యదార్థ దృష్టితో పరిశీలించి నిజమైన తెలంగాణ జాతి భాషా చరిత్రను నిర్మించవలసిన అవసరం ఉంది.

ఆంధ్ర సాహిత్య చరిత్ర నిర్మాణంలో తెలంగాణ కవుల ప్రాతినిధ్యం, ప్రత్యేకతల వివరణలు చాలామేరకు విస్మరణకు గురయ్యాయి. రాజుల పేరుతో, రాజ్యాల పేరుతో, కవుల పేరుతో, ఆంధ్ర కవిత్వ చరిత్రకు చేసిన యుగ విభజన, విశ్లేషణ తెలంగాణ కవిత్వ చరిత్రను ఇముడ్చుకున్నది కాదు. దానికి కోస్తాంధ్ర సామాజిక రాజకీయ ఉద్యమాలు, తెలంగాణ సామాజిక రాజకీయ ఉద్యమాలు పరస్పరం భిన్నం కావడం ఒక కారణమైతే, తెలుగు సాహిత్య చరిత్రకారులు బహుశా తెలంగాణవారు కాకపోవడం మరొక కారణం కావచ్చు. తెలంగాణలో కవులు ఉన్నారని చాటడానికి సురవరం ప్రతాపరెడ్డి సంకలనం చేసిన 'గోలకొండ కవుల సంచిక' సాహిత్య చరిత్రలో ప్రధానం చేయడానికి కూడా ఎవరూ పూనుకోలేదు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు తెలంగాణ సాహిత్యం గురించి రాసిన కొద్దిపాటి విషయాలను ఆధారంగా చేసుకొని అయినా తెలంగాణ సాహిత్య చరిత్రను నిర్మించవలసిన అవసరాన్ని ఎవరూ గుర్తించక పోవడం వల్ల తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణ సాహిత్య చరిత్రకు రావలసినంత గుర్తింపు రాకపోగా క్రమక్రమంగా విస్మరణకు లోనవుతూ వచ్చింది.


అందుబాటులో ఉన్న ఈ గ్రంథాలను పరిశీలిస్తే ఇదంతా తెలంగాణేతర ఆంధ్ర కవిత్వ పరిణామమే తప్ప తెలంగాణ సాహిత్య పరిణామం కాదని తెలుస్తుంది. అందువల్ల కేవలం ఆంధ్ర సాహిత్య చరిత్రలనే ఆధారం చేసుకొని తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణం చేయడం సాధ్యం కాదు. తెలంగాణ ఆధునిక కవిత్వ పరిణామాన్ని దాదాపు శూన్యం చేశారనే ఇప్పుడర్థమైంది. అందువల్ల అందుబాటులో ఉన్న గ్రంథాల దృష్టికోణంతో తెలంగాణ ఆధునిక కవిత్వాన్ని విశ్లేషించడం సాధ్యం కాదు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో యుగ విభజన కూడా తెలంగాణను మినహాయిస్తూనే జరిగింది. పునరుజ్జీవనం, నవ్యకవిత్వం, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం.... ఇత్యాది భాగాల, భావాల విభజన అంతా బ్రిటీషాంధ్రలో జరిగిన సాహిత్య వికాసాన్ని దృష్టిలో పెట్టుకొని జరిగిందే. తెలుగుజాతి వైతాళికులుగా చెప్పే కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి ఆయా రంగాల్లో నిర్వహించే సంస్కరణలు, వ్యక్తం చేసిన కొత్త భావాలు తెలంగాణ సామాజిక వాస్తవికతకు బహుదూరంలో ఉన్నాయి. భావకవిత్వాన్ని ప్రతిభావంతంగా అనుసరించిన కవులు కొందరు తెలంగాణలో ఉన్నారు కానీ, ఆ తరహా సజనకు కేంద్ర స్థానం బ్రిటీషాంధ్రయే. అభ్యుదయ కవిత్వం సంగతి చెప్పనక్కరే లేదు. బ్రిటీషాంధ్ర నుంచి వామపక్ష రాజకీయాలు సరిహద్దులు దాటి ప్రవేశించిన తర్వాత ఆ తరహా కవిత్వం తెలంగాణలోనూ బలంగా వచ్చింది గానీ, విఖ్యాతులందరూ బయటివారే. విశాలాంధ్రలో నామకరణం చెందుతూ వచ్చిన ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రుల సంస్కృతి, ఆంధ్రభాష, ఆంధ్ర సాహిత్యం, ఆధునికాంధ్ర కవిత్వం మొదలైన పదాల పరంపర నిరంతర ప్రయోగాలతో ప్రచురణలతోనైతేనేమి, యాభై యేండ్లపాలనైతేనేమి తెలంగాణ చరిత్ర, తెలంగాణ సంస్కృతి, తెలంగాణ భాష, తెలంగాణ సాహిత్యం అనే పదాలు, వాటి భావాలు, వాటి నేపథ్యాలు క్రమంగా తమ అస్తిత్వాన్ని కోల్పోయాయి.

వాస్తవానికి తెలంగాణ సాహిత్యానికి, తెలంగాణలోని సామాజిక, రాజకీయ ఉద్యమాలకు అవినాభావ సంబంధముంది. 1948లో తెలంగాణ విముక్తమయ్యే నాటికి దాదాపు 200 ఏళ్లు నిజాం పాలనలో నలిగిన తెలంగాణ ప్రజలు తమ జీవన విముక్తి కోసం అనేక చారిత్రక, సామాజిక ఉద్యమాలు చేపట్టారు. ఆనాటి తెలంగాణ వాస్తవస్థితిని అప్పటి కవులు, రచయితలు తమ తమ రచనల్లో చిత్రించారు. వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి', దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగుపూలు' మొదలైన నవలలు దాశరథి 'అగ్నిధార', 'రుద్రవీణ' కాళోజి 'నా గొడవ' కవితా సంపుటాలు ఇంకా అనేకమంది అజ్ఞాత రచయితలు, కవులు రచనలు చేశారు. వ్యాసాలు, విమర్శలు, జానపద గేయాలు వంటి ఎన్నో సాహిత్య ప్రక్రియల్లో ఆనాటి తెలంగాణ సమాజం చిత్రితమైంది. తెలంగాణలో విలసిల్లిన సాహిత్యానికి అమూల్యమైన చరిత్ర ఉంది. తెలుగు సాహిత్యంలోని కవులెందరో తెలంగాణని పునీతం చేసిన వారే. తెలుగు కవులకు ఉన్న వైశిష్ట్యాన్ని గుర్తించి 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహాన్ని' రచించిన ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు తమ గ్రంథంలో 'కొందరు తెలంగాణ కవులు' అనే పరిచ్ఛేదాన్ని కల్పించారు. దీన్నిబట్టి సాహిత్య చరిత్రలో తెలంగాణ ప్రాంతపు కవులకు గల ప్రత్యేకతను గమనించవచ్చు.

ముంగిలి (తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర) 2016. దీన్ని డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి రచించారు. తెలుగు అకాడమీ దీనిని 2016లో ముద్రించింది. దీనిలో తెలుగు సాహిత్య చరిత్రలో కనుమరుగైన తెలంగాణ కవులందరి గురించి వివరణ ఉంది. ఈ గ్రంథాన్ని 9 అధ్యాయాలుగా రాజుల పేర్లతో విభజించి, వారి కాలంలో గల అనేక 486 మంది కవులను గురించి, రచయితల గురించి సమగ్రంగా దీనిలో పేర్కొనబడింది. 'ఆంధ్ర ప్రాంతంలో పునరుజ్జీవన యుగంలో చరిత్ర, సాహిత్య చరిత్రలో కవులు, కావ్యాలను గురించి ఎంతో కృషి జరిగింది. మరచిపోయిన, మరుగున పడ్డ సాహిత్య చరిత్రను, కవులను, కావ్యాదులను పరిశోధించి వెలికితీశారు. చర్చలు జరిపి వ్యాసాలు, గ్రంథాలు రచించారు. అటువంటి పునరుజ్జీవన కాలంలో తెలంగాణలో వచ్చిన ప్రాచీన తెలుగు సంస్కృతిని, సాహిత్యాన్ని వాళ్ళు పట్టించుకోలేదు. పైగా ప్రాచీన తెలంగాణ కవులెందరినో పట్టించుకోకుండా భ్రమతో, వివక్షతో, పక్షపాత బుద్ధితో, ఉపేక్షతో కోస్తా, రాయలసీమకు చెందిన కవులుగా నిర్ణయించారు. తెలంగాణలో వచ్చిన సాహిత్య వైశిష్ట్యాన్ని, ప్రాచీనతను పట్టించుకోలేదు. దాన్ని గురించి చెప్పలేదు. పరాయి సంస్కృతి, భాషల ప్రభావంలో ఉన్న తెలంగాణలో భారత దేశంలో కన్నా భిన్నంగా స్వాతంత్ర్యోద్యమం నడిచింది. ఆ ఉద్యమంలో భూపోరాటంలో మునిగివున్న తెలంగాణలో పునరుజ్జీవనం రావలసినంత రాలేదు. ఆ అదనులో ఆంధ్ర ప్రాంతాల పండితులు, పరిశోధకులు, చారిత్రకులు, తెలంగాణను తెలుగు ప్రాంతం కాదన్నట్లుగా పట్టించుకోకుండా ఉపేక్ష చూపారు. అయితే ఇంతవరకు తెలంగాణ సాహిత్య చరిత్ర రాలేదన్న మనస్తాపాన్ని, లోటును తీరుస్తున్నది 'ముంగిలి'. తెలంగాణ సాహిత్య చరిత్ర భవనంలోకి ప్రవేశించే ముంగిటి ద్వారాన్ని తెరిచింది ఈ 'ముంగిలి' గ్రంథం. విస్తృత పరిశోధనతో, కఠిన పరిశ్రమతో తెలంగాణ సాహిత్య చరిత్ర 'ముంగిలి' గ్రంథాన్ని డాక్టర్ సుంకిరెడ్డి కూర్పు చేశాడు. ఇటువంటి అపూర్వ గ్రంథాన్ని కూర్చినందుకు నేను మరోసారి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అభినందిస్తున్నాను'. (డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, 'ముంగిలి', 'ముంగిట ద్వారం' పుట:13)

తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర (2015). ఆచార్య రవ్వా శ్రీహరి సంపాదకత్వంలో, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, డాక్టర్ కాశీం, కాసుల ప్రతాపరెడ్డి, డాక్టర్ యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్ వంటి రచయితలతో తెలుగు అకాడమీ 2016లో ఈ పుస్తకాన్ని వెలువరించింది తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర (2015). దీన్ని ఉన్నం వెంకటేశ్వర్లు, డాక్టర్ పడాల జగన్నాధరావు నియోగి ఆధ్వర్యంలో 2015లో ఉన్నం



బ్రదర్స్ పబ్లికేషన్ ప్రచురించింది. దీనిలో తెలంగాణ ఉద్యమం, తెలంగాణ విద్య అనే శీర్షిక క్రింద సమగ్రంగా తెలంగాణ సామాజిక, రాజకీయాంశాలను పేర్కొన్నారు. 'ప్రాచీన కవులు' అనే శీర్షిక పెట్టి తెలుగు సాహిత్యంలో గల తెలంగాణ ప్రాచీన కవుల గురించి చర్చించాడు. ఆధునిక కవులలో అగ్రగణ్యులైన సురవరం ప్రతాపరెడ్డి, కాళోజి, దాశరథి వంటి వారితో మొదలుకొని మొరంగపల్లి బాగన్న వరకు 76 మంది కవులు అందరిని సమగ్రంగా పేర్కొన్నారు. ఇది మొదటి సంపుటిగా రచయితలు పేర్కొన్నారు. త్వరలో రెండు, మూడు సంపుటాలు వెలువరిస్తామని కూడా తెలిపారు.

తెలంగాణ సాహిత్య వికాసం (ఆధునికత వైపు సొంత అడుగులు 1900–1940) 2015. కె.శ్రీనివాస్ 2015లో దీనిని తెలంగాణ ప్రచురణలు అనే సంస్థ ద్వారా ప్రచురించారు. దీనిని రచయిత తెలంగాణ ప్రాథమికాంశాలు, హైదరాబాద్ రాజ్యం, ఆధునిక తెలంగాణ – తొలి అడుగులు, సమకాలీన బ్రిటిష్ ఆంధ్ర వికాసోద్యమాలు: సాహిత్యం, ఆత్మాభిమాన ప్రకటన–గోలకొండ కవుల సంచిక, వికాసం నుంచి విజృంభణ అనే ఏడు అధ్యాయాలుగా విభజించాడు. ఈ గ్రంథంలో సాహిత్యం కన్నా తెలంగాణ ప్రాంత రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంఘిక అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడింది. శీర్షికలో పేర్కొన్నట్లుగా ఎక్కడా సాహిత్యం గురించి చర్చ జరగలేదు. శీర్షికలో పేర్కొన్నట్లుగా ఎక్కడా సాహిత్యం గురించి చర్చ జరగలేదు.

తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం (2015). దీన్ని ఆచార్య ఎస్వీ రామారావు రాశారు. 2015లో తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం దీనిని ప్రచురించింది. ఈ పుస్తకాన్ని మొత్తం 19గా విభజించాడు. మొదటి నుండి 12వ అధ్యాయం వరకు శతాబ్దాల వారీగా సాగిన సాహిత్యాన్ని, కవుల రచనలను పేర్కొన్నాడు. సమకాలీన సాహిత్యం పేరిట కవిత్వం, కథానిక, నవల, నాటకం, బాలసాహిత్యం, పరిశోధన – విమర్శ, వచన సాహిత్యం అనే ప్రక్రియల గురించి, రచనలు, రచయితల గురించి పేర్కొన్నాడు. అనుబంధం అనే శీర్షికలో వివిధ శాసనాలను గురించి, వివరాలను జతచేశారు. సూచికలు అనే విభాగంలో ప్రాచీన కవుల నుండి ఆధునిక రచయితల గురించి రచయిత్రుల గురించిన ఆకారాది క్రమాన్ని వారు పొందిన పురస్కారాల గురించి పేర్కొన్నాడు.

ఇతర గ్రంథాలు

తెలంగాణ సాహిత్యం – సి.కాశిం (స్నేహ ప్రచురణలు), గోలకొండ కవుల సంచిక – సురవరం ప్రతాపరెడ్డి, తెలంగాణ సాహిత్య సంస్థలు – బన్న అయిలయ్య, తెలంగాణ వైతాళికులు– ఎమ్.ఎల్. నరసింహారావు, తెలంగాణ వైతాళికులు – నెల్లుట్ల రమణరావు, తెలంగాణ ప్రాచీన సాహిత్యం – యల్లంభట్ల నాగయ్య, తెలంగాణ ఆధునిక సాహిత్యం – యల్లంభట్ల నాగయ్య, తెలంగాణ సాహిత్య రత్నాల వీణ – ద్వా.నా.శాస్త్రి, మన పండితులు – కవులు – రచయితలు– కోవెల సంపత్కుమారాచార్య, నిజాం రాష్ట్రాంధ్ర కవులు – శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, లెక్క తప్పిన తెలుగు సాహిత్య చరిత్ర – డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ సాహిత్య చరిత్ర – ముదిగంటి సుజాతారెడ్డి, తెలంగాణ సాహిత్య చరిత్ర – సుంకిరెడ్డి నారాయణరెడ్డి

తెలంగాణ సాహిత్యం గురించి వచ్చిన రచనలు, పుస్తకాలుగానే పైన పేర్కొన్నవి మాత్రమే కాదు. ఇన్నీ అనే కొలమానం లేదు. దీనిలోకి రాని తెలంగాణ సాహిత్య చరిత్ర పుస్తకాలు, రచయితల పేర్లు అనేకం ఉన్నాయి. భాషా సంస్కృతుల వైవిధ్యంతో అనేక ప్రాంతాల సమాహారంగా ఉన్న భారతదేశంలో ఒక ప్రాంతం చారిత్రక ఆర్థిక కారణాల వల్ల అభివృద్ధి సాధించి మరో ప్రాంతం మీద ఆధిపత్యం చెలాయించే ధోరణులు కనిపిస్తాయి. ఆ ఆధిపత్యం దోపిడీగా మారి ఆ ప్రాంత అస్తిత్వాన్నే సమాధి చేస్తే ఆ జాతే కనుమరుగయ్యే ప్రమాదముంది. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత సరిగ్గా యాభై ఏళ్లలో తెలంగాణ ప్రాంతం తన అస్తిత్వాన్నే కోల్పోయే ప్రమాదపు అంచున నిలబడిందని వివిధ సాంస్కృతికాంశాల్లో కూడా స్పష్టమయ్యింది. ఈ విషయాల్ని తెలంగాణ సాహిత్య చరిత్రలు నిరూపిస్తున్నాయి.

◆ జి.కృష్ణవేణి,
రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనివర్సిటీ,
9951675863

రీడ్ అండ్ టేలర్ అప్పగింతపై

ఎన్‌సీఎల్‌టీ సానుకూలం

ముంబై: ఖరీదైన సూట్లు, జాకెట్లు విక్రయించే రీడ్ అండ్ టేలర్ కంపెనీ లిక్విడేషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) నిలిపేసింది. రీడ్ అండ్ టేలర్ ఇండియా కంపెనీని నిర్వహిస్తామని, దానిని తమకు అప్పగించాలని ఉద్యోగుల సంఘం చేసిన అభ్యర్థనను ఎన్‌సీఎల్‌టీ ముంబై ధర్మాసనం మన్నించింది. దీనికి సంబంధించిన తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. ఈ కంపెనీ బకాయిలు రూ.4,100 కోట్ల మేర ఉన్నాయని, కానీ కంపెనీ విలువ ప్రస్తుతం రూ. 300 కోట్లు మాత్రమేనని, లిక్విడేషన్ చేపడితే రుణ దాతలకేమీ రాదని, ఉద్యోగులు ఉపాధి కోల్పోతారని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కంపెనీ ఉత్పత్తుల నాణ్యత, అధిక ధరలను దృష్టిలో పెటుకుని ఉద్యోగుల సంఘానికి ఒక అవకాశం ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొంది. కంపెనీలో మొత్తం 1,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సంస్థకు మైసూర్‌లో ప్లాంట్ ఉంది. ఈ కంపెనీ ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు జేమ్స్‌బాండ్ పాత్రధారి పియర్స్ బ్రాస్నన్, అమితాబ్ బచ్చన్‌లు బ్రాండ్ అంబాసిడర్‌లుగా వ్యవహరించారు.

ఎడెల్‌వీస్ వ్యాజ్యంతో ఎన్‌సీఎల్‌టీకి

కస్లివాల్ కుటుంబానికి చెందిన ఎస్ .కుమార్ గ్రూప్ రీడ్ అండ్ టేలర్ ఇండియా కంపెనీని నిర్వహిస్తోంది. ఈ కంపెనీ ఖరీదైన సూట్లు, జాకెట్లు, ట్రౌజర్లు, షర్ట్‌లు, టి-షర్ట్‌లను విక్రయిస్తోంది. ఈ కంపెనీ బ్యాంక్‌లకు, ఇతర ఆర్థిక సంస్థలకు రూ.4,100 కోట్ల మేర బకాయిలు పడటంతో వీటి వసూళ్లకు గాను ఈ కంపెనీకి వ్యతిరేకంగా ఎడెల్‌వీజ్ ఏఆర్‌సీ ఎన్‌సీఎల్‌టీలో ఒక కేసు వేసింది. ఎనిమిది కంపెనీలు రిజల్యూషన్ ప్రణాళికలను సమర్పించినప్పటికీ, అవేవీ సంత ప్తికరంగా లేకపోవడంతో రుణదాతల కమిటీ లిక్విడేషన్‌కు సిఫార్సు చేసింది.



ఫైన్‌క్వెస్ట్‌కే అధిక భారం...

రీడ్ అండ్ టేలర్ కంపెనీ నుంచి ఫైన్‌క్వెస్ట్ ఫైనాన్షియల్ సొల్యూషన్ కంపెనీకి అధికంగా రూ.800 కోట్ల మేర రావలసి ఉంది. యూనియన్ బ్యాంక్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐడీబీఐ బ్యాంక్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ తదితర సం?స్థలకు ఈ బ్యాంక్ భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉంది.

చక్కెర ఉత్పత్తి పెరిగింది

- మూడో త్రైమాసికంలో ఏడు శాతం వృద్ధి

ముంబై: భారత్‌లో చక్కెర ఉత్పత్తి 2018-19 ఆర్థికసంవత్సరం మూడో త్రైమాసికంలో ఏడుశాతం పెరిగింది. మహారాష్ట్ర కర్ణాటకల్లో చక్కెర మిల్లులు ఉత్పత్తి కార్యకలాపాలుప్రారంభించడంవల్ల చక్కెర ఉత్పత్తి ఏడుశాతంపెరిగిందని ఉత్పత్తిదారులసంఘం ఇస్మా వెల్లడించింది. గత ఏడాది డిసెంబరు 31వ తేదీనాటికి దేశంలో 510 చక్కెర మిల్లుల్లో ఉత్పత్తి కార్యకలాపాలుప్రారంభం అయ్యాయి. 110.52 లక్షల టన్నులచక్కెరను ఉత్పత్తిచేసాయి. అదే 2017 డిసెంబరు 31వ తేదీనాటికి దేశంలో 505 చక్కెరమిల్లులు 103.56 లక్షలటన్నుల ఉత్పత్తితోపోలిస్తే గణనీయంగాపెరిగిందని ఇస్మా వెల్లడించింది. మహారాష్ట్ర, కర్ణాటకల్లో చక్కెరమిల్లులు ముందుగానే క్రషింగ్ ప్రారంభించాయి. దీనివల్లనే మొదటి



త్రైమాసికంలో అంటే అక్టోబరు నుంచి ఈ ఏడాది డిసెంబరు నెలల మధ్య ఉన్న మార్కెటింగ్ సంవత్సరంలో ఉత్పత్తి మరింతపెరుగుతుందని అంచనా. మహాష్ట్రాలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం, తెల్లటి చీడపీడల కారణంగా తక్కువ పరిమాణంలోనే ఈసారి చెరకకు ఉత్పత్తి అవుతుదని అంచనావేసింది. దేశం మొత్తంగాచూస్తే ఈ సీజన్‌లో గత ఏడాదికంటే తక్కువ ఉత్పత్తిచేసే అవకాశం ఉందని ఇస్మా చెపుతోంది. అంతకుముందు అసోసియేషన్ చక్కెర ఉత్పత్తి 315 లక్షల టన్నులుగా ఉంటుందని అంచేఆవేసింది. గతంలో ఉన్న 325 లక్షల టన్నులనుంచి కొంత తగ్గుతుందని విశ్లేషించింది. దేశంలో వార్షిక దేశీయ చక్కెర ఉత్పత్తి 260 లక్షల టన్నులుగా ఉంటుందని వెల్లడించింది. ఇక మిల్లుల పరంగాచూస్తే ఉత్తరప్రదేశ్‌లో 31 లక్షల టన్నులను అక్టోబరు-డిసెంబరు సీజన్‌లో ఉత్పత్తిచేసింది. గత ఏడాదితోపోలిస్తే 10.84 శాతం రికవరీ ఉంది. గత ఏడాది 33 లోల టన్నులతో 10.14 శాతం అంతకుముందు సంవత్సరంనుంచి రికవరీ ఉత్పత్తిజరిగిందని అంచనావేసింది. చెరకునుంచి సగటు చెక్కెర ఉత్పత్తి గటిస్టంగానే ఉంది. దీనివల్ల యుపిలో చక్కెరహెక్టారుకు దిగుబడి పెరుగుతుందని చెపుతున్నారు. మొత్తం మీద ఈ ఏడాది ఎటుచూసినా చెరకు దిగుబడులు ఆశాజనకంగా కొన్ని రాష్ట్రాల్లో కనిపించడం, మరికొన్ని మిల్లుల్లో ముందస్తుగానే క్రషింగ్ ప్రారంభించడం వల్ల ఏడుశాతం చక్కెర దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు.



- బ్యాంకులు స్పందించకపోతే రెగ్యులేటరికి ఫిర్యాదు
- 30 రోజుల్లో సమస్యపై పూర్తి వివరణ
- ఖాతాదారునికి సంతృప్తికరమైన సమాధానం
- అవగాహన కల్పించాల్సిన బాధ్యత బ్యాంకుపైనే

సమస్య ఏదైన / ఫిర్యాదు చేయొచ్చు

బ్యాంకులో ఖాతాదారులకు అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటప్పడు కొన్నింటిని ఆయా బ్యాంకులు తీర్చినప్పటికీ కొన్ని సమస్యలకు మాత్రం ఎక్కడ పిర్యాదు చేయాలనే విషయంపై అవగాహన చాలా మందికి ఉండదు. అలాంటి సమస్యల పరిష్కారానికి బ్యాంకింగ్ కోడ్స్ అండ్ స్టాండర్డ్స్ బోర్డ్ ఆఫ్ ఇండియా పలు నిబంధలనలు తీసుకువచ్చింది. ఎప్పటికప్పడు వాటిలో మార్పు చేర్పులు చేస్తూనే ఉంటుంది. వాటి ద్వారా బ్యాంకులకు ఖాతాదార్లకు సమస్య పట్ల పారదర్శకమైన అవగాహనతో పాటు వివాదాలకు తావుండదు. ఎటువంటి సమస్యలు బ్యాంకులు బాధ్యత వహిస్తాయో బ్యాంకింగ్ కోడ్స్ అండ్ స్టాండర్డ్స్ బోర్డ్ ఆఫ్ ఇండియాలో నమోదైన బ్యాంకులన్ని వినియోగదారునికి కచ్చితంగా వివరించాలి. వాటిలో దేనిపైన కూడా బ్యాంకుల స్పందించకపోతే వినియోగదార్లు బీసీఎస్‌బీఐ లో పర్యాదులు చేయొచ్చు. ఆ పిర్యాదులు ఎలా చేయాలి, అందుకకు పాటించాల్సిన నియమాలను ఇప్పడు చూద్దాం.

బ్యాంకులు తమ ఖాతాదారులకు అందించాల్సిన సేవల విషయంపై బీసీఎస్‌బీఐ కొన్ని కచ్చితమైన నిబంధనలను రూపొందించింది. అయితే, వీటి గురించి ఖాతాదారులకూ అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే వారు తమకు జరిగిన సేవాలోపాలను సులభంగా గుర్తించి, ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుంది.

అన్ని సేవాలకు బ్యాంకు అందించే సేవాలోపాల్లో చిన్నవీ, పెద్దవీ అంటూ తేడా ఏమీ ఉండదు. సమస్య ఏదైనా దానికి కచ్చితమైన పరిష్కారం పొందే హక్కు ఖాతాదారులకు ఉంటుంది. ఏటీఎం నుంచి చిరిగిన నోటు రావడం దగ్గర్నుంచి, క్రెడిట్ కార్డు లావాదేవీలపై రుసుము విధించడం దాకా ఏదైనా సరే సమస్యే. ఇక్కడ ఆ ఇబ్బందిని బ్యాంకు దృష్టికి సరైన పద్ధతిలో తీసుకెళ్లారా లేదా అనేదే ముఖ్యం.



ఖాతాదారునికి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలి

బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించి ఏ విషయంపైనైనా ఖాతాదారుడు సులువుగా ఫిర్యాదు ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు బ్యాంకులో ఉండాలి. అందుకు వీలుగా బ్యాంకులో ఈ విషయాలను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి.

బ్యాంకు పేరు, శాఖ, మేనేజర్, రీజనల్ మేనేజర్/నోడల్ ఆఫీసర్ వివరాలు బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ వివరాలు, ఖాతా ప్రారంభించినప్పుడు నిబంధనలకు సంబంధించిన సమాచారాన్ని ఖాతాదారుడికి అందించాల్సిన బాధ్యత బ్యాంకుపైనే ఉంటుంది. ఎవరైనా బ్యాంకు శాఖలో నిబంధనలకు సంబంధించిన వివరాలు అడిగితే.. వారికీ అవి అందించాలి.

ఏ సంస్థలోనైనా సరే.. ఫిర్యాదుల పరిష్కారం వేగంగా సాగాలంటే.. క్షేత్ర స్థాయిలోనే దానికి సంబంధించిన ఏర్పాట్లు ఉండాలి. బ్యాంకుల విషయంలోనూ ఇది వర్తిస్తుంది. సమస్య ఎక్కడ ఉందో.. ఫిర్యాదునూ అక్కడే చేయాలి. దాదాపు అన్ని బ్యాంకులూ.. ఫిర్యాదుల పరిష్కార విభాగాలను ఏర్పాటు చేశాయి. అందువల్ల ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఖాతాదారులు ముందుగా సంబంధిత బ్యాంకు శాఖను సంప్రదించి, అక్కడి అధికారులకు సమస్యను వివరించవచ్చు. వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదించి కూడా సమస్యను నమోదు చేసి, ఫిర్యాదు క్రమ సంఖ్యను పొందొచ్చు. దీని ఆధారంగా మీ సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో సులభంగా తెలుసుకునేందుకు వీలవుతుంది. దీంతోపాటు.. బ్యాంకు వెబ్‌సైటు ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది.

అన్ని నిబంధనలనూ అనుసరిస్తూ ఫిర్యాదు చేసినప్పటికీ, బ్యాంకులో మీ సమస్య పరిష్కారం కాకపోతే.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులన్నీ ప్రిన్సిపల్ నోడల్ అధికారిని నియమించాలని రిజర్వుబ్యాంకు సూచించింది. ఫిర్యాదు చేసిన తర్వాత ఆ సమస్యను 30 రోజుల్లోగా పరిష్కరించడం లేదా ఖాతాదారుడికి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

బ్యాంకును సంప్రదించాకే..

మీరిచ్చిన ఫిర్యాదును నెల రోజుల్లోగా బ్యాంకు పరిష్కరించకపోతే.. బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించవచ్చు. బ్యాంకు అందించే సేవల్లో ఏవైనా లోపాలు ఉంటే.. వాటిని పరిష్కరించేందుకు రిజర్వుబ్యాంకు ఏర్పాటుచేసిన విభాగం ఇది. మీ బ్యాంకు ఏ అంబుడ్స్‌మన్ పరిధిలోకి వస్తుందో లేదో చూసుకొని, అక్కడ ఫిర్యాదు చేయాలి. బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ వివరాలు రిజర్వుబ్యాంకు వెబ్‌సైటులో లభిస్తాయి. ఈ సేవలను వినియోగించుకునేందుకు ఎలాంటి రుసుములూ ఉండవు.

ముందుగా బ్యాంకును సంప్రదించాకే.. అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయాలి. లేకపోతే ఆ ఫిర్యాదును తిరస్కరించే అవకాశం ఉంది. వినియోగదారుల కోర్టు, ఇతర కోర్టుల్లో ఆ వివాదానికి సంబంధించి కేసులు నడుస్తుంటే అంబుడ్స్‌మన్ ఫిర్యాదును స్వీకరించరు. బ్యాంకు సూచించిన పరిష్కారం, అంబుడ్స్‌మన్ ఇచ్చిన తీర్పులు నచ్చకపోతే, 30 రోజుల్లోగా ఖాతాదారులు వినియోగదారుల ఫోరం, కోర్టులను ఆశ్రయించవచ్చు.





అంతర్జాతీయ పరిణామాలే కీలకం

- ఈ వారం మార్కెట్‌పై నిపుణుల అంచనా
- ఆసియా మార్కెట్ల ప్రభావానికి లోనవ్వొచ్చు
- నిఫ్టీకి లాభాలు రావచ్చు



ముంబై: వరుస ఒడిదుడుకుల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్లు కదలాడుతూ మదుపరులను కలవర పరుస్తున్నాయి. కాగా నూతన సంవత్సరానికి శుభారంభం పలికి రెండు సూచీలు మరుసటి రోజు నుంచి వరుసగా పతనమై చివరికి వారంతంలో లాభాలతో ముగిశాయి. ఫెడ్ వడ్డీ రేట్లు పెంచడం ఆ ప్రభావం అమెరికా మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపడంతో అందులో కొంత దేశీయ సూచీలపై సేతం కనిపించిఇ. ఇలా పలు మార్లు లాభనష్టాలతో మార్కెట్లు కదలాడటం, ఈ వారం మార్కెట్లు ఎలా ఉండబోతున్నాయన్న విషయాలపై ప్రముఖ బ్రోకరేజీలు, మార్కెట్ నిపుణుల అంచనాలు ఇలా ఉన్నాయి.

ఎస్‌జీఎక్స్ నిఫ్టీ విదేశీ మార్కెట్లో గడచిన వారం చివరి సెషన్ లాభాల్లో ముగిసింది. సింగపూర్ ఎక్స్ఛేంజ్‌లో తన మునపటి ముగింపుతో పోలిస్తే 108 పాయింట్ల లాభంతో 10,887 పాయింట్ల వద్ద స్టాక్ మార్కెట్ వారంతం ముగిసింది. ఇది నిఫ్టీ-50 ఫ్యూచర్స్ చివరి సెషన్ ముగింపు స్థాయి 10,777 పాయింట్లతో పోలిస్తే 110 పాయింట్ల లాభంతో ఉందని గమనించాలి. అందువల్ల దేశీయంగా, అంతర్జాతీయంగా ఎలాంటి అనూహ్య పరిస్థితులు తలెత్తకపోతే నిఫ్టీ నేడు పాజిటివ్‌గా ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు ఆసియా ప్రధాన సూచీలన్నీ గత వారం చివరి సెషన్ మిశ్రమంగా ముగియడం కొంత ప్రతికూల అంశం. అయితే అమెరికా మార్కెట్లు భారీగా పెరగడం పెద్ద సానుకూల అంశం. ఇకపోతే మన మార్కెట్లు కూడా శుక్రవారం లాభాల్లోనే ముగిశాయి. అమెరికా మార్కెట్లు శుక్రవారం భారీగా లాభపడ్డాయి. డౌజోన్స్ ఇండస్ట్రీయల్ యావరేజ్ 3.29 శాతం (746 పాయింట్లు) పెరుగుదలతో 23,433 పాయింట్లకు ఎగసింది. ఎస్అండ్‌పీ 500.. 3.43 శాతం (84 పాయింట్లు) వృద్ధితో 2,531 పాయింట్లకు పెరిగింది. ఇక నాస్‌డాక్ ఏకంగా 4.26 శాతం (275 పాయింట్లు) పెరుగుదలతో 6,738 పాయింట్లకు ర్యాలీ చేసింది. అమెరికా జాబ్ మార్కెట్ గణాంకాలు బాగుండటం, ఆర్థిక వృద్ధి మందగమనానికి అడ్డుకునేందుకు చైనా చర్యలు తీసుకోవడం, వడ్డీ రేట్ల పెంపు విధానంలో సరళ విధానాన్ని అవలంబిస్తామని ఫెడ్ పేర్కొనడం వంటి అంశాలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపాయి. ఆసియా మార్కెట్ల ప్రధాన సూచీలన్నీ చివరి ట్రేడింగ్ మిశ్రమంగా ముగిశాయి. జపాన్ నికాయ్ 225 ఏకంగా 452 పాయింట్ల పతనంతో 19,561 పాయింట్లకు, తైవాన్ ఇండెక్స్ 110 పాయింట్ల నష్టంతో 9,382 పాయింట్లకు క్షీణించాయి. ఇక సింగపూర్ స్ట్రైట్స్‌టైమ్స్ 46 పాయింట్ల లాభంతో 3,059 పాయింట్లకు, హాంగ్‌కాంగ్ ఇండెక్స్ హాంగ్‌సెంగ్ ఏకంగా 562 పాయింట్ల లాభంతో 25,626 పాయింట్లకు, దక్షిణ కొరియా ఇండెక్స్ కొస్పి 17 పాయింట్ల లాభంతో 2,010 పాయింట్లకు, చైనా ఇండెక్స్ షాంఘై 51 పాయింట్ల లాభంతో 2,515 పాయింట్లకు పెరిగాయి.

ఏటీఎంలు పునరుద్దరించండి

న్యూఢిల్లీ: పనిచేయని ఏటీఎంల సమస్యలను పరిష్కరించి నగదు కొరత తీర్చాలని రిజర్వ్ బ్యాంక్‌ను పార్లమెంటరీ ప్యానెల్ కోరింది. అలాగే అవసరమైన సంఖ్యలో ఏటీఎంలను ఏర్పాటు చేయాలని కూడా తన నివేదికలో పేర్కొంది. స్టాండింగ్ కమిటీ ఆన్ ఫైనాన్స్ నివేదికను గతవారం పార్లమెంట్ ముందు ఉంచారు. ఆర్‌బీఐ సమాచారం ప్రకారం.. 2018 సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా 2,21,492 ఏటీఎంలు ఉన్నాయి. ఇందులో 1,43,844 ప్రభుత్వ



రంగ బ్యాంకులవి కాగా.. 59,645 ప్రైవేట్ బ్యాంకులవి. ఇక 18,003 ఏటీఎంలు విదేశీ, చిన్న తరహా, పేమెంట్స్ బ్యాంకులవి ఉన్నాయి. ''డిజిటల్ లావాదేవీలు ఇంకా ఎక్కడా విస్త తం కానందున.. పనిచేయని ఏటీఎంల సమస్యను ఆర్‌బీఐ వెంటనే పరిష్కరించాలి. కొరత ఉన్న ప్రాంతాల్లో వాటిని నెలకొల్పాలి. నగదు కొరత సమస్య రాకుండా చేయాలి'' అని ఆ నివేదికలో స్టాండింగ్ కమిటీ పేర్కొంది. ఆర్‌బీఐ చేపట్టిన రీమానిటైజేషన్ డ్రైవ్.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నగదు సమస్యను పరిష్కరించలేకపోయిందని, అనేక ఏటీఎంలు మూసివేతకు దారితీసిందని ఈ కమిటీకి నేతృత్వం వహించిన కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ పేర్కొన్నారు. తగిన సంఖ్యలో ఏటీఎంలు లేకపోవడంపై ఈ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పెద్దసంఖ్యలో జన్‌ధన్ ఖాతాలు తెరవడం, భారీ సంఖ్యలో డెబిట్ కార్డులు జారీ చేయడంతో.. నగదు డిమాండ్ పెరిగిందని కమిటీ తెలిపింది.

వసూళ్లు పెంచేందుకు కొత్త పథకాలు

న్యూఢిల్లీ: వస్తుసేవలపన్నుచట్టం అమలులోనికి వచ్చిన తర్వాత పన్నురిటర్నులు దాఖలుపెరిగిందని, పన్నులు చెల్లించే వారి బేస్ పెరిగిందని చెబుతున్న ప్రభుత్వం అదేస్థాయిలో పెరిగిన ఇన్‌పుట్ ట్యాక్స్‌క్రెడిట్ మోసాలను గుర్తించడంలేదు. గుజరాత్‌లో వెలుగుచూసిన భారీ మోసాలనుచూస్తే ఇప్పటికీ జీఎస్‌టీ రిటర్నుల్లో తప్పులు తడకలు నివేదిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఇక రిటర్నులు దాఖలును పరిశీలిస్తే గడచిన ఏడాదిగా 28.75శాతం తగ్గింది. వీరంతా నవంబరు 2018వరకూ రిటర్నులు దాఖలుచేయలేదని తేలింది. అదే 2017 నవంబరునాటికి 10.56శాతం మంది రిటర్నులు దాఖలుచేసారు. దీన్నిబట్టిచూస్తే రిటర్నులు దాఖలు చేయనివారిసంఖ్య మరింతగా పెరుగుతున్నట్లు తేలిందని స్వాక్షాత్తూ ఆర్థికశాఖ అంగీకరించింది. ఇక కాంపోజిషన్‌పన్ను చెల్లింపుదారుల్లో రిటర్నులు దాఖలుచేయనివారు కూడా 25.37 శాతం వరకూ జులై సెప్టెంబరు మధ్యకాలంలో పెరిగారు. కాంపోజిషన్ స్కీంలో బిజినెస్ సంస్థలు పన్నులు రాయితీలరేట్‌లో చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. జీఎస్‌టీ పరిధిలో పన్నుచెల్లింపులు మరింత సులభతరం చేసేందుకు వీలవుతుందని అంచనా. కోటి రూపాయలకు మించినటర్నోవర్ ఉన్న సంస్థలు వ్యాపారులు ఈ కాంపోజిట్‌స్కీంకు అర్హులు. ఈ నిర్లక్ష్యంపై అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి. అయితే సంబంధిత పరిధుల్లోని అధికారులు ఈ పన్నుచెల్లింపుదారుల రిటర్నుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలనచేస్తున్నట్లు తేలింది. తరచూ తనిఖీలద్వారా రిటర్నులు పరిశీలనచేయాలని నిర్ణయించారు. నకిలీ ఇన్వాయిస్‌లు ఉపయోగించి ఐటిసి లబ్దిపొందుతున్న వారిసంఖ్యకూడా పెరుగుతుంది. నాలుగు కేసుల్లో 9.75 కోట్లు ఉన్నట్లు తేలింది. మరో 499 కేసుల్లో 39894.94 కోట్లు వరకూ ఉందని తేల్చింది. ఉత్పత్తిపై జరిపే చెల్లింపుల వ్యవధి, ఇన్‌పుట్స్‌పై అప్పటికే చెల్లించిన పన్నునుబమినహాయించుకునేందుకు ఐటిసిని ఉపయోగిస్తారు.తొమ్మిదినెలల్లో ఏడునెలలు కొంతమేర రిటర్నులు దాకలు తగ్గింది. జీఎస్‌టీ పన్నువసూళ్లు సైతం తగ్గాయి. జీఎస్‌టీ వసూళ్లు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో సగటున 1.23 లక్షలకోట్లుగా ఉండాలని బడ్జెట్ అంచనాలు వేసారు. ఈ ఆర్థికసంవత్సరంలో కొంతతగ్గుతుందని ఆర్థికశాఖ అధికారులే అంగీకరించారు. సుమారు 40వేల కోట్లవరకూ తగ్గొచ్చని అంచనా. ఇక పన్నుల ఎగవేతనుసైతం ఏప్రిల్ నవంబరునెలలమధ్యకాలంలో 12,767 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో 7910



కోట్లు రికవరీచేసారు. అలాగే జీఎస్‌టీ రిటర్నుల్లో జాప్యంజరిగితే లేట్ ఫీజులుసైతం వసూలుచేయడాన్ని రద్దుచేసారు. పన్నురిటర్నులు మరింతగా పొందుపరిచేందుకువీలుగా ఈనిర్ణయం తీసుకున్నారు. జీఎస్‌టీ మండలి సమావేశంలోనే ఈనిర్ణయం తీసుకున్నట్లు తేలింది.


'యన్.టి.ఆర్ కథానాయకుడు' చిత్రంలో నందమూరి బాలకృష్ణ

క్రిష్ వెబ్‌సిరీస్



దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బయోపిక్ 'యన్.టి.ఆర్'ను తెరకెక్కిస్తోన్న దర్శకుడు జాగర్లమూడి క్రిష్. ఇప్పుడు మరో చరిత్రకు శ్రీకారం చుడుతున్నారు. ఆ చరిత్ర ఎవరిదో కాదు రాజరాజచోళుడుకి సంబంధించింది. మరో విషయమేమంటే ఇది వెబ్ సిరీస్‌గా తెరకెక్కనుంది. ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించిన రచన జరుగుతుంది. ఆరుభాగాల ఈ వెబ్‌సిరీస్‌ను క్రిష్ నిర్మిస్తుంటే 'భాషా', 'మాస్టర్' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు సురేష్ కృష్ణ తెరకెక్కిస్తున్నారట. త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. ఆసక్తికరమైన విషయమేమంటే తమిళంలో ఈ వెబ్ సిరీస్ రూపొందనుంది. తర్వాత క్రిష్ ఈ వెబ్ సిరీస్‌ను తెలుగులోకి అనువదించాలనుకుంటున్నారట.

నయనతార ఐరా



కోలీవుడ్ లేడీ సూపర్‌స్టార్ నయనతార మహిళా ప్రధానమైన పాత్రల్లో నటిస్తూ వరుస విజయాలను సొంతం చేసుకుంటుంది. ఇప్పుడు ఆమె నటిస్తోన్న మరో లేడీ ఓరియెంటెడ్ మూవీ 'ఐరా'. ఈ సినిమా తెలుగు, తమిళ టీజర్ నేడు విడుదలైంది. ఇప్పటి వరకు నయనతార మెయిన్‌లీడ్‌గా నటించిన చిత్రాలన్నీ తమిళం తర్వాతే తెలుగులోకి విడుదలయ్యేవి. కానీ ఇప్పుడలా కాకుండా రెండు భాషల్లో ఒకేసారి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ట్రైడెంట్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఆర్.రవీంద్రన్ సినిమాను విడుదల చేస్తున్నారు. కె.జె.ఆర్.స్టూడియోస్ బ్యానర్‌పై కోటపాడి జె.రాజేష్ సినిమాను నిర్మిస్తున్నారు. సార్జున్ కె.ఎం. దర్శకుడు. ''మళ్లీ ఆడపిల్ల పుట్టిందిరా! అయ్యో! ఆడపిల్లా! ...నే చెప్పానుగా.. నీ కోసం వస్తానని చెప్పానుగా ..నాకే తెలియని ఓ ఆరుగురు నా తలరాతను తలక్రిందులుగా రాశారు'' అనే సంభాషణలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సినిమా సస్పెన్స్ థ్రిల్లర్ అని, హారర్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయని అర్థమవుతోంది. ఇందులో నయనతార డబుల్ రోల్ చేస్తుందని వార్తలు వినపడుతున్నాయి. కలైఅరసన్, యోగిబాబు కీలక పాత్రధారులు. టీజర్ ఆసక్తికరంగా ఉంది. మరి సినిమా రీలీజ్ గురించి త్వరలోనే అధికారిక సమాచారం వెలువడొచ్చు. తెలుగులో డైలాగ్స్‌ను శశాంక్ వెన్నెలకంటి రాయగా.. పాటలను రాకేందు మౌళి రాశారు.

షారూక్‌తో ఫాతిమా





ఫాతిమా సనా షేక్.. ఆమిర్‌ఖాన్ 'దంగల్' చిత్రంతో నటిగా తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. తర్వాత అమితాబ్, ఆమిర్, కత్రినాలతో కలిసి థగ్స్ ఆఫ్ హిందుస్థాన్‌లో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా పెద్దగా విజయం సాధించక పోయినా, నటిగా ఫాతిమా మంచి మార్కులను సంపాదించుకుంది. ఇప్పుడు షారూక్ ఖాన్‌తో కలిసి ఫాతిమా సనా షేక్ నటించనుంది. వివరాల్లోకెళ్తే.. అంతరిక్షంలోకి అడుగు పెట్టిన తొలి భారతీయుడు రాకేష్ శర్మ బయోపిక్ రూపొందనుంది. ఇందులో షారూక్ జతగా ఫాతిమా నటించనుందనే బాలీవుడ్ వర్గాల సమాచారం. అనురాగ్ బసు దర్శకత్వంలో రోనీ స్క్రూనీవాలా, సిద్ధార్థ్ రాయ్ కపూర్ సంయుక్తంగా నిర్మించనున్న ఈ చిత్రానికి 'సెల్యూట్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది.

డిప్రెషన్‌కు కారణమదే...!


కత్రినా కైఫ్

'నేటి యువత వాస్తవ ప్రపంచంలో లేరు. ఎక్కువ శాతం మంది ఊహాలోకంలోనే ఉంటున్నారు. అందుకు కారణం సోషల్ మీడియానే' అని అంటోంది సొగసరి కత్రినా కైఫ్. ఈ అమ్మడు సోషల్ మీడియా గురించి ఇంకా మాట్లాడుతూ 'యువత ఓ విషయానికి సంబంధించిన వాస్తవికతను గుర్తించకుండా ఎవరికీ తోచిన ఆలోచనలు వారే ఊహించేసుకుంటున్నారు. అలా యువత పక్క దోవ పట్టడానికి సోషల్ మీడియానే కారణం. భవిష్యత్‌లో నా పిల్లలను సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండేలా చూసుకుంటాను. ఏదైనా ప్రాక్టికల్‌గా నేర్చుకుంటేనే అందులో లోతు అర్థమవుతుంది. ఓ రకంగా ఇలాంటి వాస్తవిక ఆలోచనా దోరణి లేకపోతే డిప్రెషన్ కూడా వచ్చే ప్రమాదం ఉంది'' అని అంటుంది కత్రినా కైఫ్.

నిర్మాతల కోసం మ్యాస్ట్రో


ఇళయరాజా

ఇసై జ్ఞాని, మ్యాస్ట్రో ఇలా అందరూ వారి అభిమానానికి తగ్గట్లుగా ఇళయరాజాను పిలుచుకుంటూ ఉంటారు. ఆయన 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా తమిళ నిర్మాతల మండలి ఆయన ఆధ్వర్యంలో ఓ మ్యూజిక్ కన్సర్ట్‌ను నిర్వహించనుంది. ఈ మ్యూజిక్ కన్సర్ట్‌ను ఫిబ్రవరి 2, 3 తేదీల్లో నందనంలోని వై.ఎం.సి.ఎ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఈ మ్యూజిక్ ప్రోగ్రామ్ ద్వారా వచ్చే మొత్తంతో ఓ స్థలాన్ని కొని సినిమాల్లో నష్టపోయిన నిర్మాతలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని నిర్మాతల సంఘం అధ్యక్షుడు విశాల్ అనుకుంటున్నారు. ఇలాంటి బృహత్‌కార్యానికి ఇళయరాజా ముందుకు రావడం మంచి పరిణామమని అందరూ ఆయన్ను ప్రశంసిస్తున్నారు.

'హుషారు'గా రీమేక్

తేజస్ కంచెర్ల, తేజ్ కూరపాటి, దినేష్, అభినవ్, దక్షా నగార్కర్, ప్రియా వడ్లమాని, హేమల్, రాహుల్ రామకృష్ణ తారాగణంగా రూపొందిన చిత్రం 'హుషారు'. శ్రీహర్ష కొనుగంటి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, రియాజ్ నిర్మాతలు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ సినిమాను తమిళంలో రీమేక్ చేయబోతున్నారు. వి.వి.కదిర్ దర్శకత్వంలో జె.ఫణీంద్రకుమార్ సినిమాను నిర్మించనున్నారు.

తమిళంలో కూడా కొత్త నటీనటులతో సినిమాను తెరకెక్కిస్తారట. తెలుగులో ఈ సినిమాకు సంగీతం అందించిన రథన్.. తమిళంలో కూడా సంగీతాన్ని అందించబోతున్నారు. త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.







ముహూర్తం కుదిరింది

తమిళ అగ్ర కథానాయకుడు విజయ్ తన తదుపరి చిత్రాన్ని అట్లీ దర్శకత్వంలో చేయబోతున్న సంగతి తెలిసిందే. కల్పాతి అఘోరం నిర్మించనున్న ఈ సినిమా లాంఛనంగా ఇటీవల చెన్నైలో పూజా కార్యక్రమాలను జరుపుకుంది. తాజా సమాచారం ప్రకారం జనవరి 21 లేదా 22 తేదీల్లో సినిమా సెట్స్‌కి వెళ్లనుంది. థెరి, మెర్సల్(తెలుగులో అదిరింది) సినిమాల తర్వాత విజయ్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందబోయే హ్యాట్రిక్ మూవీ ఇది. ఇదొక స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుంది. ఇందులో విజయ్ కోచ్ పాత్రలో కనపడనున్నారట. నయనతార హీరోయిన్‌గా నటించబోయే ఈ సినిమాకు ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాది దీపావళి సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.


పెళ్లైన తర్వాత తొలిసారి


దీపికా పదుకొనె

గత ఏడాది బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్, హీరోయిన్ దీపికా పదుకొనె ఓ ఇంటివారైన సంగతి తెలిసిందే. అంతకు ముందు వీరివురూ కొన్ని సినిమాల్లో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే పెళ్లి తర్వాత ఇద్దరూ కలిసి ఓ సినిమాలో నటించబోతున్నారు. అది కూడా ఓ బయోపిక్‌లో. 1983 వరల్డ్ కప్‌లో భారత పతాకను ఎగరేసిన ఇండియన్ టీం కెప్టెన్ కపిల్ దేవ్ ఆయన టీం.. వరల్డ్ కప్ ప్రయాణాన్ని సినిమా రూపంలో తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఇందులో కపిల్ దేవ్ పాత్రలో రణ్‌వీర్ నటిస్తున్నారు. కాగా కపిల్ దేవ్ సతీమణి రోమీ భాటియా పాత్రలో దీపికా పదుకొనెను నటింప చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తుంది. ఈ విషయంపై యూనిట్ దీపికను కూడా కలిసింది. ఆమె కూడా పాజిటివ్‌గానే స్పందించిందని వార్తలు వినపడుతున్నాయి. అంతా ఓకే అయితే రణవీర్ సింగ్, దీపికా పదుకొనె పెళ్లి అయిన తర్వాత నటించే తొలి చిత్రమిదే అవుతుంది. కబీర్‌ఖాన్ దర్శకత్వంలో రిలయన్స్, ఫాంటమ్, విబ్రీ మీడియా కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

90,000 కోట్లు ఆదా

- ఆధార్‌తో అర్హులకే సబ్సిడీ పథకాలు
- దేశంలో ఆధార్ ఓ గేమ్ చేంజర్
- మోదీ నేతృత్వంలో విజయవంతం
- దేశానికి ఏటా 77 వేల కోట్లు ఆదా
- 122 కోట్ల ఆధార్ నెంబర్లు జారీ
- కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 6: ఆధార్ కార్డు వల్ల నిజమైన అర్హులకు మాత్రమే సబ్సిడీ పథకాలు అందుతున్నాయని, అనర్హులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు ఆపివేశామని, దీనివల్ల గత మార్చి వరకూ దాదాపు 90 వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం ఆదా అయిందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. దేశంలో ఆధార్ ఒక గేమ్ ఛేంజర్ అని అన్నారు. ఆధార్ వల్ల ఎంతో లాభం జరుగుతోందని చెప్పారు. ఆధార్ వల్ల ఆదా అయిన ప్రభుత్వ ధనంతో ఆయుష్మాన్ భారత్ వంటి మూడు భారీ సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చని తెలిపారు. లక్షలాది పేదలకు ఉచిత వైద్య సేవలందించేందుకు కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఆధార్‌ను విజయవంతంగా అమలు చేసిందని అన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం సొంత ప్రయోజనాల కోసం సరిగా అమలు చేయలేదని విమర్శించారు. ఆధార్ ఉపయోగించడం వల్ల భారత్ ఏటా రూ.77 వేల కోట్లు ఆదా చేయగలుగుతోందని ప్రపంచ బ్యాంకు నివేదికలో వెల్లడించిందని తెలిపారు. ఆదా అయిన సొమ్ముతోనే ఆయుష్మాన్ భారత్ వంటి పథకాన్ని ప్రవేశపెట్టామని వివరించారు. ఈ పథకం ద్వారా ఏటా రూ. 5 లక్షల మంది పేదలకు ఆరోగ్యబీమా అందించడమే లక్ష్యమని అరుణ్ జైట్లీ వెల్లడించారు. దీని ద్వారా 10.74 కోట్ల పేద కుటుంబాలు, మధ్యతరగతి వారు లబ్ధిపొందనున్నట్టు చెప్పారు. గత సెప్టెంబరులో ఈ పథకాన్ని ప్రారంభించిన తర్వాత దాదాపు 7 లక్షల మంది పేదలకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించినట్టు తెలిపారు. ఆధార్ ద్వారా లబ్ధిదారులకు ఇప్పటి వరకూ 1,69,868 కోట్ల రూపాయలను సబ్సిడీగా అందజేసినట్టు వివరించారు. ఆధార్ వల్ల మధ్యవర్తుల జోక్యం తగ్గిందని, దీంతో ప్రయోజనాలన్నీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేరుతున్నాయన్నారు. 2016లో ఆధార్ బిల్లు ఆమోదం పొందిన తర్వాత గత 28 నెలల్లో 122 కోట్ల ఆధార్ నెంబర్లను జారీ చేసినట్టు తెలిపారు. దేశంలో 18 ఏళ్ల వయసు దాటిన వారు 99 శాతం ఆధార్ కార్డు పొందినట్టు అరుణ్ జైట్లీ వెల్లడించారు. 58.24 కోట్ల రేషన్ కార్డు దారులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్టు తెలిపారు. 10.33కోట్ల నరేగా లబ్దిదారులకు వేతనాలు వారి ఖాతాలోనే పడుతున్నాయని తెలిపారు. అలాగే 21 కోట్ల మంది పాన్ కార్డు దారులను వారి ఆధార్ నెంబర్లతో ఆదాయ పన్ను శాఖ అనుసంధానం చేసినట్టు వెల్లడించారు.

త్వరలో డ్రైవింగ్ లైసెన్స్ అనుసంధానం

డ్రైవింగ్ లైసెన్స్‌లను తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధానం చేసేలా కేంద్రం త్వరలో చట్టం తీసుకురానున్నట్టు కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు చట్టంలో సవరణలు తీసుకువస్తున్నట్టు వెల్లడించారు. ఎవరికైనా వారి వ్యక్తిగత గుర్తింపును రూఢీ చేసుకోవడానికి ఆధార్ పారదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు. ''ఉదాహరణకు ఓ వ్యక్తి తాగిన మైకంలో రోడ్డు ప్రమాదంలో నలుగురిని చంపేసి పంజాబ్ నుంచి మరో ప్రాంతానికి పారిపోయి మరో గుర్తింపు కార్డుతో నకిలీ డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చు. ఆధార్‌తో అనుసంధానం చేశాక ఎవరైనా పేరు మార్చుకోవచ్చు. అంతేకాని వారి బయోమెట్రిక్స్ మార్చుకోలేరు. మరో గుర్తింపు కార్డుతో నకిలీ డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు ప్రయత్నిస్తే.. అప్పటికే అతనికి డ్రైవింగ్ లైసెన్స్ ఉందని, మరొకటి ఇవ్వరాదని ఆధార్ అనుసంధానం ద్వారా తెలుస్తుంది'' అని రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

కాంగ్రెస్‌కు అంత సీన్‌లేదు

- బీజేపీని ఓడించడానికి మేం చాలు
- కాంగ్రెస్ లాంటి పార్టీలు అక్కర్లేదు
- అమేథీ, రాయ్‌బరేలి వదిలేస్తాం..
- యూపీలో వాళ్లు అప్రాధాన్య శక్తి
- కాంగ్రెస్ గురించి ఆలోచించడంలేదు
- బీఎస్పీతో కలిసి మేం పోరాడుతాం
- సమాజ్‌వాదీ పార్టీ నాయకుడి వ్యాఖ్య



కోల్‌కతా, జనవరి 6: ఉత్తరప్రదేశ్‌లో రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీని ఓడించడానికి బీఎస్పీతో కలిసి తాము సరిపోతామని, కాంగ్రెస్ పార్టీకి అంత సీన్ లేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు కిరణ్మయ్ నందా అన్నారు. లోక్‌సభలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహించే రాయ్‌బరేలి, అమేథి నియోజకవర్గాలను మాత్రం తాము వాళ్లకు వదిలిపెడతామని ఆయన చెప్పారు. యూపీలో కాంగ్రెస్ పార్టీ ఒక అప్రాధాన్య శక్తి అని, అందుకే వాళ్లను తమ కూటమిలో కలుపుకోవడం లేదా వదిలేయడం గురించి కనీసం ఆలోచించడం కూడా లేదని నందా అన్నారు. సమాజ్‌వాదీ-బహుజన సమాజ్‌పార్టీల కూటమి బలమైన శక్తి అని, ఇదే బీజేపీ మీద పోరాడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఒకటి లేదా రెండు సీట్లలో మాత్రమే ఉంటుందని, వాళ్లు తమను తాము ఎక్కడ చూసుకోవాలనుకుంటున్నారో ఆ పార్టీయే నిర్ణయించుకోవాలని సమాజ్‌వాదీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు నందా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా కూటమి రాజకీయాలకు ఇంకా అలవాటు పడాల్సి ఉందని, తాను బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఒక్క అంగుళం కూడా వేరే పార్టీకి ఇష్టపడకుండా.. తాను బలహీనంగా ఉన్నచోట్ల మాత్రం బలమైన పార్టీల నుంచి భారీగా లబ్ధి పొందాలనుకుంటుందని, ఇది ఏమాత్రం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని ఎస్పీ-బీఎస్పీ కూటమికి వెలుపల ఉంచడం వల్ల బీజేపీకి లబ్ధి కలుగుతుందేమోనని విలేకరులు ప్రశ్నించగా.. గత అనుభవాలను బట్టి చూస్తే ఎస్పీ-బీఎస్పీ కూటమి అభ్యర్థులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నిలబడినా, తమకు బీజేపీని ఓడించడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని అన్నారు. యూపీలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు చాలా అప్రాధాన్యమైనదని, దానివల్ల ఎవరికీ లాభంగానీ, నష్టం గానీ ఉండబోవని ఎద్దేవా చేశారు. కొన్నిచోట్ల గతంలో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను నిలబెట్టలేదని, అప్పుడు వాళ్ల ఓట్లు బీజేపీకి వెళ్లాయని చెప్పారు. ఫూల్‌పూర్, గోరఖ్‌పూర్ లోక్‌సభ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎస్పీ-బీఎస్పీ కూటమి అభ్యర్థులకు పోటీ పెట్టిందని, కానీ దానివల్ల ఏ ప్రభావమూ లేకపోవడంతో తమ కూటమి బీజేపీని ఓడించడానికి ఇబ్బంది ఏమీ ఎదురుకాలేదని కిరణ్మయ్ నందా విశ్లేషించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఒకవేళ మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ముందే పొత్తులు పెట్టుకుని ఉంటే బీజేపీ పూర్తిగా ఓడిపోయేదని అన్నారు. కావాలనే ఆ రెండు రాష్ట్రాల్లో ఎస్పీ-బీఎస్పీతో కాంగ్రెస్ పొత్తుపెట్టుకోలేదని చెప్పారు. అందరి నుంచి వాళ్లు ప్రయోజనం పొందుతారు గానీ, తమకు అవకాశం ఉన్నా కూడా ఎవరితోనూ పంచుకోరని మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం ఉన్నప్పుడు అక్కడ మత్స్యశాఖ మంత్రిగా నందా పనిచేశారు. ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీ కూటమి ఫలితాలను తారుమారుచేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే కూటమి స్వీప్ చేస్తుందని, బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. కేంద్రంలో తదుపరి ప్రభుత్వ ఏర్పాటులో సమాజ్‌వాదీ పార్టీ కీలకపాత్ర పోషిస్తుందని, కానీ తాము ప్రధాని రేసులో మాత్రం లేమని అన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఉన్న మొత్తం 80 స్థానాలకుగాను 73 చోట్ల బీజేపీ గెలవగా, సమాజ్‌వాదీ 5, కాంగ్రెస్ రెండుచోట్ల మాత్రమే గెలిచాయి. బీఎస్పీకి ఒక్కటీ రాలేదు.



బీజేపీ ప్రపంచ రికార్డు!

- అమిత్‌షా ర్యాలీలో 5వేల కిలోల ఖిచిడీ
- దళితుల ఇళ్లలో బియ్యం.. పప్పు సేకరణ
- రాంలీలా మైదానంలోనే భారీగా వంటకం

న్యూఢిల్లీ, జనవరి 6: బీజేపీ ఒక ప్రపంచరికార్డు సాధించింది. పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా పాల్గొన్న ర్యాలీ సందర్భంగా 5వేల కిలోల ఖిచిడీ వండి.. దాన్ని పార్టీ కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేయడం ద్వారా ఈ రికార్డు నెలకొల్పారు. ఇందుకు కావల్సిన బియ్యం, పప్పులు అన్నింటినీ దళితుల ఇళ్ల నుంచి మాత్రమే సేకరించడం మరో విశేషం. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో జరిగిన 'భీమ్ మహాసంగమ్ విజయ్ సంకల్ప్' ర్యాలీలో ఈ ఖిచిడీని పంచిపెట్టారు. సుప్రసిద్ధ షెఫ్ సంజీవ్‌కపూర్ ఇంతకుముందు 2017 సంవత్సరంలో 918 కిలోల ఖిచిడీని ఒకసారి వండారు. ఇంత పెద్ద మొత్తంలో ఖిచిడీ వండటం ఇదే మొదటిసారి కావడంతో అదే ఇప్పటివరకు ప్రపంచ రికార్డుగా ఉంది. అప్పట్లో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' కార్యక్రమంలో ఆయనీ వంట చేశారు. ఇప్పుడు దాన్ని తలదన్నేలా ఏకంగా 5వేల కిలోల ఖిచిడీని వండి బీజేపీ నేతలు మరోసారికొత్త రికార్డు సృష్టించారు.

ముగ్గురు మంత్రుల సెక్రటరీలు అరెస్టు

- యూపీలో స్టింగ్ ఆపరేషన్ ఫలితం
- వ్యక్తిగత కార్యదర్శులపై అవినీతి మరక
- అసెంబ్లీ ప్రాంగణంలోనే లంచాలు

లఖ్‌నవూ, జనవరి 6: అవినీతి, లంచాల ఆరోపణలతో ముగ్గురు మంత్రుల వ్యక్తిగత కార్యదర్శులనుయూపీ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసింది. రాష్ట్రంలోని ఒక వార్తా చానల్ చేసిన స్టింగ్ ఆపరేషన్‌లో.. ఆ ముగ్గురూ అసెంబ్లీ ప్రాంగణంలోనే లంచాలు తీసుకుంటూ దొరికేశారు. ఈ వీడియో ప్రసారం కావడంతో.. వెంటనే సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ వ్యవహారంపై విచారణకు అదనపు డైరెక్టర్ జనరల్ (లక్నో జోన్) రాజీవ్ కృష్ణన్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేశారు. ముందుగా ముగ్గురు కార్యదర్శులను సస్పెండ్ చేసి, సిట్ సభ్యులతో తన ఇంట్లో సమావేశం ఏర్పాటుచేశారు. బుధవారం వీడియో ప్రసారం కాగా, గురువారం ఉదయం 11 గంటలకల్లా తనకు సిట్ నివేదిక కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోరారు. మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి అర్చనా పాండే, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్, విద్యాశాఖ మంత్రి సందీప్‌సింగ్‌ల కార్యదర్శులు అరెస్టయ్యారు. ఒక బదిలీ కోసం రూ. 40 లక్షల లంచం అడిగినందుకు రాజ్‌భర్ కార్యదర్శి ఓంప్రకాష్ కశ్యప్‌పై ఈ స్టింగ్ ఆపరేషన్ చేశారు. మిగిలిన ఇద్దరూ మైనింగ్, పుస్తకాల విషయంలో అక్రమ ఒప్పందాలు చేసుకున్నారు. తనను తాను ఒక కాంట్రాక్టర్‌గా చెప్పుకొన్న సదరు విలేకరికి మరో సెక్రటేరియట్ ఉద్యోగి స్కూలు బ్యాగులు, యూనిఫాంల కాంట్రాక్టు ఇప్పిస్తానని కూడా చెప్పాడు. రాష్ట్ర పరిపాలనలో నూటికి నూరుశాతం నిజాయితీ సాధించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తరచు తన సమావేశాలలో చెబుతుంటారు. అవినీతిని ఏమాత్రం సహించేది లేదని కూడా ఆయన అంటుంటారు.

పరికర్ ప్రాణాలకు ముప్పు

- రఫేల్ నిజాలు సమాధి చేసేందుకు దాడి జరగచ్చు
- రాష్ట్రపతికి గోవా కాంగ్రెస్ చీఫ్ లేఖ

పణాజి, జనవరి 6: రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో జరిగిన అవినీతికి సంబంధించిన కీలక సమాచారంతో కూడిన అతి ముఖ్యమైన దస్తావేజులు మాజీ రక్షణమంత్రి, ప్రస్తుత గోవా సీఎం మనోహర్ పరికర్ వద్ద ఉండగా, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జీవితం ప్రమాదంలో ఉందని..గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు గిరీష్ చోదంకార్ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. క్యాన్సర్ నుంచి కోలుకుంటున్న పరికర్‌కు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిందిగా లేఖలో ఆయన డిమాండ్ చేశారు. పరికర్ తన పడక గదిలో ఈ ఫైళ్లను దాచారన్న గోవా ఆరోగ్యశాఖా మంత్రి విశ్వజిత్ రాణే మాట్లాడిన ఆడియో టేపులపై ఇంకా ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదని గిరీష్ ప్రశ్నించారు. ఈ కీలక పత్రాలు వెలుగులోకి రాకూడదన్న అక్కసుతో పరికర్ ప్రాణాలకు ఎసరు పెట్టే ప్రమాదం కూడా ఉందని గిరీష్ లేఖలో ఆరోపించడం విశేషం. ఫైళ్లలో ఉన్న అసలు విషయాలను పరికర్ బయటపెటవచ్చని, ఇందుకు ఆయనకు అత్యుత్తమమైన భద్రత కల్పించాలంటూ లేఖలో వివరించారు. కాగా ఇవి కావాలని ఎవరో సష్టించిన నకిలీ టేపులని, మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని పరికర్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను రాణే ఇప్పటికే కోరారు.

ఆప్‌కు మరో షాక్

- పంజాబ్ ఎమ్మెల్యే ఖైరా రాజీనామా
- కేజ్రీవాల్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు




న్యూఢిల్లీ, జనవరి 6: పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి మరో షాక్ తగిలింది. వారం రోజుల వ్యవధిలోనే మరో నాయకుడు ఆ పార్టీకి రాజీనామా చేశారు. పంజాబ్ అసెంబ్లీలో ఎమ్మెల్యే సుఖ్‌పాల్ ఖైరా పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆప్ సీనియర్ నాయకుడు హెచ్ఎస్ ఫూల్కా రాజీనామా చేసిన రెండు రోజులకే ఖైరా కూడా అదే బాటలో వెళ్లడం గమనార్హం. ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తిగా తన సిద్ధాంతాల నుంచి పక్కకు పోయిందని, అన్నా హజారే ఉద్యమం తర్వాత పార్టీ ప్రారంభించే సమయంలో ఉన్న సిద్ధాంతాలు ఏవీ ఇప్పుడు పార్టీలో లేవని పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌కు పంపిన రాజీనామా లేఖలో ఖైరా ఆరోపించారు. హెచ్ఎస్ ఫూల్కా కూడా దాదాపుగా ఇవే ఆరోపణలు చేశారు. పార్టీ తన మూల రాజకీయ సిద్ధాంతాలను పాటించడం లేదని ఆయన అన్నారు. అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని 2012లో రాజకీయ పార్టీగా మార్చడమే తప్పని.. ఇప్పుడు మనకు మరో అన్నా ఉద్యమం రావాలని అన్నారు. తప్పును తప్పని చెప్పడానికి భయపడని సమాంతర శక్తి అవసరమని చెప్పారు. అన్నాహజారే నేతృత్వంలోని అవినీతి వ్యతిరేక ఉద్యమానికి మద్దతిచ్చిన అరవింద్ కేజ్రీవాల్, మరికొందరు కలిసి 2012లో ఆమ్ ఆద్మీ పార్టీని స్థాపించారు. ఫూల్కా ఇన్నాళ్లూ పార్టీ అధిష్ఠానంతో సత్సంబంధాలతోనే ఉన్నా, ఖైరా మాత్రం అలా లేరు. గత సంవత్సరం నవంబరులో ఒకసారి ఆయన పార్టీ నుంచి సస్పెండయ్యారు. పంజాబ్ ఎన్నికల సందర్భంగా శిరోమణి అకాలీదళ్ నాయకుడు బిక్రమ్ మజీతియాను 'డ్రగ్ లార్డ్' అన్నందుకు తర్వాత కేజ్రీవాల్ ఆయనకు క్షమాపణ చెప్పారు. దీన్ని విమర్శించినందుకు ఖైరాను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. జూలై నెలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఖైరాను పంజాబ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి పదవి నుంచి తప్పించి ఆయన స్థానంలో హర్‌పాల్ సింగ్ చీమాను నియమించింది. దీంతో, తనను తప్పించిన కొన్ని రోజుల తర్వాత తమకు ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్ర నాయకత్వంతో సంబంధం లేదని, పంజాబ్ ఆప్ స్వతంత్ర విభాగమని ఖైరా ప్రకటించుకున్నారు. వలంటీర్ల సదస్సు కూడా ఒకటి ఏర్పాటుచేయగా దానికి పంజాబ్‌లోని 20 మంది ఎమ్మెల్యేలలో 8 మంది హాజరయ్యారు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కూడా వచ్చారు. సట్లెజ్-యమునా లింక్ కాల్వ వ్యవహారంలో అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్ కంటే హరియాణా ప్రయోజనాలకు పెద్దపీట వేశారన్నారు.

గడ్కరీని ఉపప్రధాని చేయండి

- పార్టీ చీఫ్‌గా శివరాజ్‌సింగ్ చౌహాన్
- యూపీ సీఎంగా రాజ్‌నాథ్ ఉండాలి
- బీజేపీ నేత సంఘప్రియ గౌతమ్ బాంబు
- వాజ్‌పేయి హయాంలో కేంద్ర మంత్రి

లఖ్‌నవూ, జనవరి 6: బీజేపీ కురువృద్ధుడు సంఘప్రియ గౌతమ్ (88).. తమ పార్టీపై పెద్ద బాంబు వేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఉపప్రధానమంత్రిగా నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలన్నారు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను యూపీ ముఖ్యమంత్రిగా చేయాలని కూడా సూచించారు. అమిత్‌షా రాజ్యసభలో గట్టిగా పనిచేయాలని, అందుకోసం ఆయనకు పార్టీ బాధ్యతలు తప్పించాలని అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఒక లేఖ విడుదల చేశారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పరిమితం చేయాలన్నారు. మన దేశంలో పుట్టిన గొప్ప నాయకులలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒకరని.. కానీ 2019 ఎన్నికల్లో మాత్రం మరోసారి మోదీ హవా కనిపించడం అనుమానమేనని అన్నారు. అటల్‌బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆయన మంత్రివర్గంలో సభ్యుడైన సంఘప్రియ గౌతమ్.. ఉన్నట్టుండి ఇలా వ్యాఖ్యానించడంతో బీజేపీ నేతలకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మోదీ మంత్రం పనిచేయడం అనుమానమేనని, ఈ విషయాన్ని పార్టీ కార్యకర్తలు తమ వ్యక్తిగత సంభాషణలలో చెప్పుకొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం ఉందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే కొన్ని రాష్ట్రాలలో తప్ప చాలాచోట్ల బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందని మండిపడ్డారు. ప్రణాళికా సంఘం పేరు మార్చడం, సీబీఐ, రిజర్వుబ్యాంకుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం లాంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. ఉత్తరాఖండ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయాలనుకోవడాన్ని కూడా తప్పుబట్టారు. ఎలాగోలా గోవా, మణిపూర్‌లలో ప్రభుత్వాలను ఏర్పాటుచేయాలనుకోవడం కూడా సరికాదన్నారు.



రాజుగారి ప్రేమకథ!

- గద్దె దిగిన మలేషియా రాజు
- అందగత్తెతో పెళ్లే కారణం?

కౌలాలంపూర్, జనవరి 6: మలేషియా రాజు తన పదవిని త్యాగం చేశారు. ఈమేరకు రాజ కుటుంబం ఆదివారం కీలక ప్రకటన చేసింది. గత కొన్ని రోజులుగా సెలవులో ఉన్న రాజు, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. రష్యాకు చెందిన ఓ అందగత్తెను రాజు వివాహం చేసుకున్నట్టు పెద్దఎత్తున పుకార్లు ప్రచారంలో ఉండగా, రాజకుటుంబం చేసిన అధికారిక ప్రకటన ఇప్పుడు ఇదే అనుమానాన్ని దృఢపరుస్తోంది. ''నేషనల్ ప్యాలెస్ చెబుతున్న విషయం ఏమిటంటే దేశానికి 15వ రాజైన రాజు గారు తన పదవికి రాజీనామా చేశారు, ఇది ఈనెల 6 నుంచి అమల్లోకి వస్తుంది'' అన్నది అధికారిక ప్రకటన సారాంశంగా ఉంది.

ప్రేమ కోసం సింహాసనం త్యాగం

మిస్ మాస్కోగా 2015లో ఎంపికైన ఢ్యూన్ అందగత్తె ఒక్సనా వెవోడినాతో రాజు సుల్తాన్ మహమ్మద్ 5 వివాహం జరిగినట్టు ఇంటర్నెట్‌లో ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఒక్సనా వయసు 25 ఏళ్లు కాగా రాజు మహమ్మద్ ప్రస్తుత వయసు 49 ఏళ్లు. 2016 డిసెంబరులో ఆయన రాజుగా సింహాసనాన్ని అధిష్ఠించగా, గత నవంబరు నుంచి తనకు ఆరోగ్యం బాగాలేదన్న కారణంతో ఆయన సెలవులో ఉన్నారు. మరోవైపు రాజుగారిని ప్రేమ వివాహం చేసుకున్న మిస్ మాస్కో తన మతం మార్చుకుని ఇస్లాంలోకి మారి, ఆ ఫొటోలను కూడా నెట్‌లో అప్‌లోడ్ చేశారు. రాజ్యాంగపరంగా రాజరికం అనుసరిస్తున్న మలేషియాలో ఓ రాజకీయ ప్రత్యేకత ఉంది. ప్రతి ఐదేళ్లకోమారు రాజు మారేలా ప్రత్యేక చట్టాలు ఇక్కడ అమల్లో ఉన్నాయి. ఇందులో భాగంగా మలేషియా దేశంలోని 9 రాష్ట్రాలకు చెందిన శతాబ్దాల చరిత్ర గల రాజకుటుంబీకులకు సింహాసనం అధిష్ఠించి, పరిపాలించే అవకాశం దక్కుతుంది. ప్రస్తుత రాజు మహమ్మద్ గద్దె దిగడంతో తదుపరి రాజసింహాసనం అధిష్ఠించేది ఎవరనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.



కొన్నేళ్లుగా కోమాలో.. బాబుకు జన్మనిచ్చిన తల్లి!


- లైంగిక దాడిపై అనుమానం

అరిజోనా, జనవరి 6: అమెరికాలో దారుణం జరిగింది. కొన్నేళ్లుగా కోమాలో ఉన్న ఓ మహిళ.. ఒక బాబుకు జన్మనిచ్చింది. దీంతో ఆమెపై లైంగిక దాడి జరిగి ఉంటుందని అరిజోనా ఆసుపత్రి వర్గాలు అనుమానిస్తున్నాయి. ఆమె బాబుకు జన్మనిచ్చేవరకు అసలు ఆమె గర్భవతిగా ఉన్న విషయం కూడా ఆసుపత్రి సిబ్బంది ఎవరికీ తెలియలేదని అంటున్నారు. స్వచ్ఛంద సంస్థ హసైండా హెల్త్‌కేర్‌లో ఉన్న దారుణమైన పరిస్థితులు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయని వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. అయితే, ఈ విషయంలో వాస్తవాలను తప్పకుండా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని, ఇలా ఇంతకుముందెన్నడూ ఇక్కడ జరగలేదని స్వచ్ఛంద సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

అఫ్ఘానిస్థాన్‌లో 30 మంది మృతి

- బంగారు గని గోడలు కూలడంతో ప్రమాదం

కుండుజ్, జనవరి 6: అఫ్ఘానిస్థాన్‌లో ఓ బంగారు గని గోడలు కూలిపోవడంతో కనీసం 30 మంది కార్మికులు మరణించారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఉత్తర అఫ్ఘానిస్థాన్‌లోని బదక్షన్ ప్రావిన్స్‌లోని కోహిస్థాన్ జిల్లాలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బంగారు నిధి కోసం కార్మికులు నది పక్కన 60 మీటర్ల లోతు మేర తవ్వారు. ఈ క్రమంలో బంగారు గని గోడలు కూలిపోవడంతో వారు ప్రాణాలు కోల్పోయారు. నిధి తవ్వకాలపై ప్రభుత్వ నియంత్రణ లేదని, కొన్ని దశాబ్దాలుగా గ్రామస్తులు బంగారం కోసం తవ్వకాలు చేపడుతున్నారని కోహిస్థాన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహ్మద్ రుస్తం రఘీ తెలిపారు. విషయం తెలియగానే ప్రమాద స్థలికి సహాయక బృందాలను పంపామని, అప్పటికే గ్రామస్తులు మృతదేహాలను వెలుపలకి తీశారని వెల్లడించారు. తజకిస్థాన్, చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉన్న బదక్షన్ ప్రావిన్స్ వెనుకబడిన ప్రాంతం. శీతాకాలంలో చరియలు విరిగిపడే ప్రమాదముంది. అయినా అక్కడ నిత్యం గ్రామస్తులు బంగారం కోసం తవ్వకాలు చేపడుతుంటారు.




గాల్లోకి కాల్పులు.. కొడుకు మృతి

- కొత్త సంవత్సర సంబరాల్లో విషాదం

న్యూఢిల్లీ, జనవరి 6: కొత్త సంవత్సరం సంబరాల్లో జరిగిన విషాదాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఢిల్లీలోని న్యూ ఉస్మాన్‌పూర్ ప్రాంతంలో కొత్త సంవత్సరం సంబరాల్లో భాగంగా ఒక వ్యక్తి గాల్లోకి కాల్పులు జరిపినపుడు పొరపాటున ఆ బుల్లెట్ తగిలి అతడి ఎనిమిదేళ్ల కొడుకు మరణించాడు. ఢిల్లీలోనే ఫతేపూర్ బేరి ప్రాంతంలోని తన ఫాంహౌస్‌లో జేడీయూ మాజీ నేత ఒకరు ఇలాగే గాల్లోకి కాల్పులు జరుపుతుండగా ఒక మహిళా ఆర్కిటెక్టు మరణించిన విషయం తెలిసిందే. ఈ వ్యక్తి జరిపిన కాల్పులలో బుల్లెట్ అతడి కొడుకు కుడి బుగ్గలోంచి వెళ్లిందని, వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడని పోలీసులు తెలిపారు. బాలుడి తండ్రే ప్రధాన నిందితుడని తమ విచారణలో తేలిందన్నారు.

భారతీయ విద్యార్థి 'సెల్ఫీ' మృతి

- ఐర్లండ్‌లో కొండ అంచున సెల్ఫీ
- జారి.. సముద్రంలో పడి మరణం



డబ్లిన్, జనవరి 6: ఐర్లండ్‌లో ఓ కొండ అంచున సెల్ఫీ తీసుకునే ప్రయత్నం ఓ భారతీయ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. గుర్తుతెలియని ఆ విద్యార్థి (20) డబ్లిన్‌లోని ఓ యూనివర్సిటీలో చదువుతున్నట్లు మాత్రం తెలిసింది. ఐర్లండ్‌లో పర్యాటకులు ఎక్కువగా వెళ్లే క్లిఫ్స్ ఆఫ్ మొహెర్ వద్ద సెల్ఫీ తీసుకుంటూ.. బ్యాలెన్స్ తప్పి అతడు జారి సముద్రంలోకి పడిపోయాడు. ఆ సమయంలో వందలాది మంది పర్యాటకులు అక్కడే ఉన్నారు. హెలికాప్టర్ సాయంతో ఆ ప్రాంతంలో వెంటనే గాలింపు చర్యలు మొదలుపెట్టగా, సముద్రంలో ఆ విద్యార్థి దొరికాడు. సమీపంలోని డూలిన్ నగరంలో ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే ప్రాణాలు పోయినట్లు వైద్యులు తెలిపారు. ఆ సమయంలో అక్కడున్న పర్యాటకులను ఐర్లండ్ పోలీసులు విచారించి.. ఇది ప్రమాదవశాత్తు సంభవించినదేనని తేల్చారు.

సిరీస్ మనదే!

చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైన కోహ్లీ సేన

- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 300 ఆలౌట్
- ఫాలోఆన్ ఆడుతున్న ఆసీస్
- డ్రా దిశగా చివరి, నాల్గో టెస్టు





కుల్‌దీప్ అరుదైన ఘనత

ఆస్ట్రేలియా గడ్డపై యువ స్పిన్ సంచలనం కుల్‌దీప్ యాదవ్ చరిత్ర సృష్టించాడు. ఆసీస్ గడ్డపై ఏ ఆటగాడికి దక్కని అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో నాల్గో టెస్టులో యాదవ్ రికార్డు నెలకొల్పాడు. 64ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో టెస్టుల్లో ఐదు వికెట్లు తీసిన తొలి లెఫ్టార్మ్ బౌలర్‌గా కుల్‌దీప్ సరికొత్త రికార్డు నెలకొల్పి చరిత్ర సృష్టించాడు. కుల్‌దీప్ తన స్పిన్ మాయాజాలంతో కంగారూలను కకావికలం చేయడంతో 300 పరుగులకు కుప్పకూలింది. ఆసీస్‌తో నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో కుల్‌దీప్ యాదవ్ ఆడుతున్న తొలి టెస్టు ఇదే. తన మొదటి టెస్టులోనే 64ఏళ్ల రికార్డును బద్ధలు కొట్టాడు. కంగారూల గడ్డపై ఐదేసి వికెట్లు తీసిన సెకండ్ లెఫ్టార్మ్ మణికట్టు స్పిన్నర్‌గా యాదవ్ ఈ ఫీట్ అందుకున్నాడు. చివరగా 1955లో సిడ్నీ మైదానంలో ఆసీస్‌తో టెస్టులో ఇంగ్లాండ్ ఆటగాడు జానీ వార్డ్‌లే(5 79) అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. మొత్తంగా ఆసీస్‌లో ఐదు వికెట్లు తీసిన ఆరో భారత బౌలర్‌గా 24ఏళ్ల స్పిన్నర్ యాదవ్ నిలిచాడు. భారత్ చివరిసారిగా 1986లో ఆస్ట్రేలియాలో ఆసీస్‌ను ఫాల్ ఆన్ ఆడించగా ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి నాల్గో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా బౌలర్లు విజృంభించారు. దీంతో 300 పరుగులకే ఆసీస్ ఆలౌట్ అయింది. 236/6 ఓవర్ నైట్ స్కోరుతో ఆస్ట్రేలియా నాలుగో రోజు బ్యాటింగ్ ప్రారంభించింది. అయితే, వర్షం కారణంగా మ్యాచ్ మూడు గంటల ఆలస్యంగా మొదలైంది. నాలుగో రోజు 20 ఓవర్లు ఆడి 64 పరుగులు మాత్రమే జోడించి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. కుల్‌దీప్ యాదవ్ ఐదు వికెట్లు తీయగా, షమీ, జడేజా చెరో రెండు వికెట్లు తీశారు. బుమ్రా ఖాతాలో ఒక వికెట్ పడింది. భారత్ 322 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆసీస్ ఫాలోఆన్ ఆడుతోంది. నాలుగో రోజు ఆసీస్ ఇన్నింగ్స్ త్వరగా ముగించాలన్న టీమిండియా కోరికకు వరుణుడు అడ్డుతగిలాడు. వర్షం కారణంగా మ్యాచ్ మూడు గంటల ఆలస్యంగా ప్రారంభమైన్పటికీ టీమిండియా బౌలర్లు మాత్రం పట్టుదల వదల్లేదు. మ్యాచ్ ప్రారంభమైన ఆరు ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టి టెయిలెండర్లపై ఒత్తిడి పెంచారు. 85వ ఓవర్లో షమీ వేసిన బంతికి పాట్ కమిన్స్(25) బౌల్డ్ అయ్యాడు. తర్వాత హ్యాండ్స్‌కాంబ్ (37)ను బుమ్రా బౌల్డ్ చేసి పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాతి ఓవర్లోనే ఆసీస్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది. 91వ ఓవర్లో కుల్‌దీప్ వేసిన బంతికి లియాన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి పెయిన్ సేన 258 పరుగులు చేసింది. తొమ్మిది వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆసీస్‌కు టెయిలెండర్లు ఊతమిచ్చారు. వికెట్ కోల్పోకుండా నిలకడగా ఆడారు. 10 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 42 పరుగులు జోడించారు. క్రీజులోకి వచ్చిన తర్వాత రెండు సార్లు టీమిండియా బౌలర్ల చేతిలో తప్పించుకున్న హేజిల్‌వుడ్ కుల్‌దీప్ బుట్టలో పడ్డాడు. 105వ ఓవర్లో కుల్‌దీప్ యాదవ్ వేసిన బంతిని అంచనా వేయలేకపోయిన హేజిల్‌వుడ్(21).. ఎల్బీగా వెనుదిరిగాడు. ఫలితంగా ఆసీస్ 300 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 322 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.



స్కోరుబోర్డు


టీమిండియా తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ (బి) జడేజా 79, ఖ్వాజా (సి) పుజారా (బి) కుల్‌దీప్ యాదవ్ 27, లబ్బూంజ్ (సి) రహానే (బి) షమీ 38, షాన్ మార్ష్ (సి) రహానే (బి) జడేజా 8, హెడ్ (సి) (బి) కుల్‌దీప్ యాదవ్ 20, హ్యాండ్స్‌కంబ్ (బి) బుమ్రా 37, పెయిన్ (బి) కుల్‌దీప్ 5, కమిన్స్ (బి) షమీ 25, స్టార్క్ (నాటౌట్) 29, లియాన్ (ఎల్బీ) (బి) కుల్‌దీప్ 0, హేజిల్‌వుడ్ (ఎల్బీ) (బి) కుల్‌దీప్ 21, ఎక్స్‌ట్రాలు:11, మొత్తం: (104.5 ఓవర్లలో 300 ఆలౌట్). **వికెట్ల పతనం:** 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198, 7-236, 8-257, 9-258, 10-300. **బౌలింగ్:** షమీ 19-2-58-2, బుమ్రా 21-5-62-1, జడేజా 32-11-73-2, కుల్‌దీప్ యాదవ్ 31.5-6-99-5, విహారి 1-0-2-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖ్వాజా (నాటౌట్) 4, హారిస్ (నాటౌట్) 2, మొత్తం: (4 ఓవర్లలో 6/0). **బౌలింగ్:** షమీ 2-1-4-0, బుమ్రా 2-1-2-0.

రవిశాస్త్రికి గవాస్కర్ సూపర్ పంచ్

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయానికి టీమిండియా అత్యంత చేరువలో ఉంది. ఈ ఘనత సాధించిన తొలి కెప్టెన్, తొలి కోచ్‌గా నిలవడానికి విరాట్ కోహ్లీ , రవిశాస్త్రిలు తహతహలాడుతున్నారు. అయితే ఈ సమయంలో మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కోచ్ రవిశాస్త్రికి ఓ సూపర్ పంచ్ వేశాడు. తొలి టెస్టు గెలిచిన తర్వాత రవిశాస్త్రి చేసిన కామెంట్స్‌కు సునీల్ గవాస్కర్ కౌంటర్ వేశాడు. సోషల్ మీడియా వేదికగా రవిశాస్త్రిపైన సహజంగానే నెటిజన్లు సాకు కోసం



చూస్తూ ఉంటారు. అలాంటిది గవాస్కర్ చేసిన వ్యాఖ్యలకు మద్ధతుగా నిలిచి రవిశాస్త్రిని ఏకీపారేశారు. ఆసీస్ గడ్డపై తొలి టెస్ట్‌లో గెలిచేసరికి శాస్త్రి కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది. తొలి టెస్టు అనంతరం మాట్లాడిన రవిశాస్త్రి.. వేల కిలోమీటర్ల దూరంలో ఉండి విమర్శలు చేయడం చాలా ఈజీ అని తేల్చపడేశాడు. ఇదే విషయాన్ని గవాస్కర్ ప్రస్తావించాడు. ఆదివారం సిడ్నీ టెస్టు నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత మురళీ కార్తీక్‌తో కలిసి మ్యాచ్‌పై విశ్లేషణ చేసిన సందర్భంగా గవాస్కర్ చేసిన కామెంట్స్ ఆసక్తికరంగా ఉన్నాయి. పెర్త్ టెస్ట్‌లో ఓటమి టీమిండియాకు ఓ మేలుకొలుపులా పనిచేసిందని మురళీ కార్తీక్ అన్నాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న గవాస్కర్ మాట్లాడుతూ.. మరి ఆ మేలుకొలుపు ఎలా వచ్చింది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న వాళ్ల విమర్శల నుంచే వచ్చింది. ఆ విమర్శల సడితోనే ఈ జట్టు మేల్కొందని గవాస్కర్ అన్నాడు. టీమిండియాతో టెస్టు సిరీస్‌లో తలపడుతోన్న ఆస్ట్రేలియా ఓటమి దిశగా పయనిస్తున్న క్రమంలో తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకే కుప్పకూలి ఫాలోఆన్‌ను తప్పించుకోలేకపోయింది. ఇలా సొంతగడ్డపై ఆసీస్ ఫాలోఆన్ ఆడటం 30 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. 1988లో సొంత గడ్డపై చివరిసారి ఇదే సిడ్నీ మైదానంలో ఇంగ్లాండ్‌తో ఫాలో ఆన్ ఆడిన ఆసీస్.. మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇక విదేశాల్లో 2005లో చివరగా ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫాలో ఆన్ ఆడిన ఆసీస్ పరాజయం పాలైంది. దాంతో పాటుగా భారత్‌కు ఆసియా వెలుపల అత్యల్ప టార్గెట్‌తో ఫాలో ఆన్ ఇవ్వడం కూడా ఇదే మొదటిసారి.

హాప్‌మన్ కప్ ఫెదరర్ జట్టుదే

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మిక్స్‌డ్ టెన్నిస్ టోర్నమెంట్ హాప్‌మన్ కప్‌ను రోజర్ ఫెదరర్ జట్టు గెలుచుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో రోజర్ ఫెదరర్-బెలిండా బెన్సిచ్ (స్విట్జర్లాండ్) జట్టు అలెగ్జాండర్ జ్వెరెవ్-ఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ) జట్టుపై 2-1తో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో ఫెదరర్



6-4, 6-2తో జ్వెరెవ్ (జర్మనీ)ను ఓడించడంతో స్విట్జర్లాండ్‌కు 1-0 ఆధిక్యం దక్కింది. రెండో మ్యాచ్‌లో కెర్బర్ (జర్మనీ) 6-4, 7-6 (8/6)తో బెన్సిచ్‌పై (స్విట్జర్లాండ్) విజయం సాధించడంతో స్కోరు 1-1తో సమం అయింది. ఇక నిర్ణయత్మక మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ఫెదరర్-బెన్సిచ్ జోడీ 4-0, 1-4, 4-3 (5/4)తో జ్వెరెవ్-కెర్బర్ జంటను ఓడించి టైటిల్‌ను దక్కించుకున్నారు.

టీమిండియా అద్భుతం

- భారత్‌పై ప్రశంసలు కురిపించిన మాజీ క్రికెటర్లు





వెంగ్‌సర్కార్

ముంబై: ఆస్ట్రేలియాలో అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్న టీమిండియాను మాజీ క్రికెటర్లు దిలీప్ వెంగ్‌సర్కార్, ప్రవీణ్ ఆమ్రే ప్రశంసించారు. చరిత్ర సృష్టించబోతున్న కోహ్లీసేనను అభినందించారు. సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన సిడ్నీలో విజయం దిశగా పయనిస్తోంది. ఆస్ట్రేలియాతో 1948లో లాలా అమర్‌నాథ్ నేతృత్వంలో భారత్ తొలిసారి అక్కడ పర్యటించింది. బ్రాడ్‌మన్ సేనతో పోరాడింది. ఆసీస్ సొంతగడ్డపై భారత్ తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ కైవసం చేసుకోవడం ఇదే తొలిసారి. 'టీమిండియా అద్భుతం. చక్కని క్రికెట్ ఆడుతోంది. ఆస్ట్రేలియాను దాని సొంతగడ్డపై ఓడించడం చాలా పెద్ద విజయం. అక్కడి పరిస్థితుల్లో ఆసీస్ చాలా కఠిన జట్టు. విరాట్ సేనకు ఇది అత్యుత్తమ గుర్తింపు. అక్కడి కఠిన పరిస్థితులను టీమిండియా అందిపుచ్చుకుంది. ప్రతి జట్టు విదేశాల్లో ఎలా ఆడుతుందో అన్నదాన్ని బట్టి రేటింగ్ ఇస్తారు. కోహ్లీసేన అందరినీ గర్వపడేలా చేసింది. బుమ్రా ప్రస్తుతం ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకడు. అతనో పరిపూర్ణ బౌలర్' అని వెంగ్‌సర్కార్ కొనియాడారు. 'ప్రతి సిరీస్‌లోనూ తొలి టెస్టు చాలా కీలకం. టీమిండియా ఆరంభం బాగుంది. రెండో టెస్టులో ఆస్ట్రేలియా తిరిగి పుంజుకోవడంతో సిరీస్ కఠినంగా మారింది. మూడో మ్యాచ్ అత్యంత కీలకం. అందులో టీమిండియా ఆట అద్భుతం. అనూహ్యం. సిరీస్ గెలవాలంటే జట్టుగా కష్టపడాలి. బుమ్రాకు హ్యాట్సాఫ్. భారత్‌కు పటిష్ట బ్యాటింగ్ లైనప్ ఉంది. కానీ నిలకడగా 20 వికెట్లు తీయడం సంగతేంటి? గత నాలుగు సిరీసుల్లో ఇది జరుగుతోంది. నేనైతే ఒక్కటే శతకం చేశా. పుజారా మాత్రం అనూహ్యం. ఆత్మవిశ్వాసం, ఓపిక ఎంత ముఖ్యమో అతడు మరోసారి నిరూపించాడు' అని ప్రవీణ్ ఆమ్రే తెలిపారు.

డీఆర్ఎస్ ఆప్షన్ మరిచారా

ఆస్ట్రేలియా బ్యాటింగ్‌పై మండిపడ్డ రికీ పాంటింగ్

సిడ్నీ: భారత్‌తో జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆటతీరుపై ఆ దేశ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. ఆటలో నాలుగోరోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 236/6తో తొలి ఇన్నింగ్స్‌ని కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టు.. కుల్‌దీప్ యాదవ్ (5/99) ధాటికి 300 పరుగులకే కుప్పకూలిపోయింది. దీంతో.. 322 పరుగుల భారీ ఆధిక్యం భారత్‌కి లభించగా.. కంగారూల టీమ్‌ని కెప్టెన్ కోహ్లీ ఫాలో ఆన్ ఆడించాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 6/0తో నిలిచింది. అయితే.. తొలి ఇన్నింగ్స్‌లో నాథన్ లియాన్ వికెట్ అప్పనంగా భారత్‌కి ఆస్ట్రేలియా ఇచ్చేసిందని పాంటింగ్ ఆరోపించాడు. ఆదివారం జట్టు స్కోరు 258 వద్ద కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో అప్పుడే క్రీజులోకి వచ్చిన నాథన్ లియాన్ (0: 5 బంతుల్లో) ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. అయితే.. రిప్లైలో బంతి వికెట్లకు తాకేలా కనిపించలేదు. దీంతో.. ఒకవేళ నాథన్ డీఆర్ఎస్ అడిగింటే..? జీవనదానం లభించేది. కానీ.. నాన్‌స్ట్రైక్ ఎండ్‌లో మిచెల్ స్టార్క్.. నాథన్‌కి సమీక్ష అడిగే విషయంలో తన స్పష్టమైన అభిప్రాయాన్ని చెప్పకపోవడంతో అతను డీఆర్ఎస్ అడిగే సాహసం చేయలేదు. 'ఆ ఔట్.. మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టుపై ఉన్న ఒత్తిడి ఏంటో..? స్పష్టంగా చెప్పింది. అంపైర్ ఔట్ నిర్ణయంపై అనుమానం ఉన్నప్పుడు డీఆర్ఎస్ అడగొచ్చు కదా..? ఎందుకు ఆలోచించారు. అప్పటికి టీమ్‌కి లభించిన రెండు రివ్యూలు కూడా అలానే ఉన్నాయి. కానీ.. ఇద్దరూ ఆ విషయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోయారు. సహచరుడి వికెట్ కాపాడాలనే ఆలోచనే మిచెల్ స్టార్క్‌కి లేదు' అని పాంటింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



నిఖత్ జరీన్‌కు కాంస్యం

- నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్: నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. ఈ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం 51 కిలోల విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిఖత్ జరీన్ 3-2తో హరియాణాకు చెందిన పింకీ రాణి చేతిలో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.



డుప్లెసిస్‌ను సస్పెండ్ చేసిన ఐసీసీ

దుబాయ్: మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా కేప్‌టౌన్ వేదికగా జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా సౌతాఫ్రికా కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్‌పై ఐసీసీ ఒక టెస్టు నిషేధం విధించింది. ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.22.1 ప్రకారం.. మైనర్ ఓవర్ రేట్ తప్పు. ఈ నేరానికి పాల్పడిన వాళ్లకి స్లో ఓవర్ వేసిన టీమ్‌లోని ప్రతీ ఆటగాడికి 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధిస్తారు. ఇక కెప్టెన్‌కి రెట్టింపు మొత్తం ఫైన్ విధిస్తారు. ఈ క్రమంలో స్లో ఓవర్ రేట్ కారణంగా డుప్లెసిస్‌ని ఒక టెస్ట్ పాటు సస్పెండ్ చేసిన ఐసీసీ.. అతని మ్యాచ్ ఫీజులో 20 శాతం.. ఇతర ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించింది. డుప్లెసిస్ స్లో ఓవర్ రేటు నేరానికి పాల్పడటం ఇది రెండోసారి.

కుల్‌దీప్‌ను నుంచి ఇంకెంతో ఆశించొచ్చు

- టీమిండియా బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్

సిడ్నీ: టీమిండియా మణికట్టు మాంత్రికుడు కుల్‌దీప్ యాదవ్‌పై బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ ప్రశంసల జల్లు కురిపించారు. ఇంగ్లాండ్ పర్యటనతో పోలిస్తే అతడు మరింత మెరుగయ్యాడని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టులో కుల్‌దీప్ విజృంభించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 99 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. దీంతో ఆసీస్ 300 పరుగులకు కుప్పకూలి ఫాలోఆన్ ఆడుతోంది. 'కుల్‌దీప్ నైపుణ్యమున్న బౌలర్ అని నిరూపించాడు. వన్డేల్లో విజయవంతమయ్యాడు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో చాలా తక్కుమంది చిన్‌మన్ బౌలర్లు ఉన్నారు. అందులో కుల్‌దీప్ ఎంతో ప్రత్యేకం. అతడు గూగ్లీలు అద్భుతంగా వేస్తాడు. కుల్‌దీప్ క్రీజును ఉపయోగించుకొనే విధానం బాగుంటుంది. అన్ని రకాలుగా బౌలింగ్ చేయగటడు. కుల్‌దీప్ నుంచి ఇంకెంతో రాబట్టుకోవచ్చు. ఇంగ్లాండ్‌లో కలిసిరాలేదు. ఈ మ్యాచ్ ఆత్మవిశ్వాసం ఇచ్చింది. మున్ముందు చాలా క్రికెట్ ఆడగలడు. సిడ్నీ మైదానం స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. అందుకే ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగాం. విదేశాల్లో మా బౌలింగ్ దాడి చాలా మెరుగుగా, పటిష్టంగా మారింది' అని బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ అన్నారు.



సౌతాఫ్రికాదే సిరీస్

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో జరిగిన రెండో టెస్టులో సౌతాఫ్రికా జట్టు 9 వికెట్లతో ఘనవిజయం సాధించి మరో టెస్టు మ్యాచ్ మిగిలుండగానే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. గత గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 177 పరుగులకే కుప్పకూలింది. సౌతాఫ్రికా బౌలింగ్‌లో ఒలివర్ నాలుగు వికె ట్లు, స్టెయిన్ మూడు వికెట్లు, రబాడ రెండు వికెట్లు తీసి పాక్‌ను కట్టడి చేశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా జట్టు 431 పరుగులు చేసి కుప్పకూలింది. దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌లో కెప్టెన్ డుప్లెసిస్ (103) సెంచరీ చేయగా... ఓపెనర్ మార్కరమ్ (78), బావుమా (75), డికాక్ (59) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాక్ జట్టు కేవలం 294 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో పాక్ జట్టు సౌతాఫ్రికాకు 41 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. ఈ మ్యాచ్‌లో సెంచరీ బాదిన సౌతాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com